Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

హారిక, హాసిని
కేటరింగ్ & కుకింగ్
బ్రాహ్మణ భోజనాలు
అతి తక్కువ ధరలకే లభించును
All Function Catering (Veg) Order Taken
ప్రొప్రైయిటర్ : సంతోష్ కుమార్
Ph : 8985488221
9014911305
పెదగదిలి, సింహగిరి కోలని, విశాఖపట్నం

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 246 విశాఖపట్నం, 16 జూలై 2024 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## భక్తులకు కనువిందు చేస్తున్న జగన్నాధుడు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** లోకానికి వెలుగులు ప్రసాదించే ఆ జగన్నాధస్వామి తన దివ్య అవతారాల తో భక్తులు కు కనువిందు చేస్తున్నారు. ఇక అవతారాల్లో భాగంగా సోమవారం శ్రీరామ అవతారంలో జగన్నాథ స్వామి ని దర్శించుకున్న లక్షలాది మంది భక్తులు పరవశించి పోయారు. దక్షిణ నియోజకవర్గం పరిధి 35 వార్డు టర్నర్ సత్రం కళ్యాణ మండపంలో జరుగుతున్న శ్రీ జగ న్నాథ స్వామి వారి రథయాత్రలో భాగంగా శ్రీ స్వామి వారు శ్రీరామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుండే స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు దీరారు. సాలిపేట వరకు క్యూ లైన్లు చేరుకున్నాయి. ఆదివారం కావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. విజయ నగరం జిల్లా రామ తీర్థం దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానం ఫెస్టివల్ ఆఫీసర్, దేవదాయశాఖ సహాయ కమీషనర్ కె.శిరీష, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.రాజగోపాల్ రెడ్డిల పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.శ్రీ ఎంబరుమన్నార్ స్వామి, కోదండరామ స్వామి దేవస్థానంల ఈఓ నీలిమ, శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం ఈఓ కె.గాయత్రి, శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానం ఈఓ రమాబాయిలు రథోత్సవంలో పాల్గొని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారు.

## వైకాపా ప్రభుత్వం అడవులను కూడా వదల్లేదు

**అమరావతి:** గత ఐదేళ్లలో వైకాపా నేతలు సహజ వనరులను దోపిడీ చేశారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. అడవులను కూడా గత ప్రభుత్వం ధ్వంసం చేసిందని అన్నారు. గత ప్రభుత్వంలో సహజవనరుల దోపిడీపై సచివాలయంలో చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. వైకాపా హయాంలో భూములు, ఖనిజాలు, అటవీ సంపదను దోచేశారని విమర్శించారు. "కొత్త విధానం ఏర్పాటు చేసుకొని మరీ దోపిడీ చేశారు. విశాఖ, ఒంగోలు, చిత్తూరులో భూకబ్జాలకు పాల్పడ్డారు. ఇళ్ల నిర్మాణం పేరుతో దందా చేశారు. 23 పార్టీ కార్యాలయాల పేరుతో అక్రమాలకు పాల్పడ్డారు. వైకాపా నేతలు, కార్యకర్తలకు అసైన్డ్ భూములు అప్పగించారు. ల్యాండ్



టైటిలింగ్ చట్టం పేరుతో భూ దోపిడీకి కుట్రపన్నారు." అని చంద్రబాబు మండిపడ్డారు.

**ముందే స్థలం కొని.. అనేక రెట్ల పరిహారం**

" విశాఖలోని రామానాయుడు స్టూడియో భూములు కొట్టేసేందుకు విఫల యత్నం చేశారు. వృద్ధాశ్రమానికి ఇచ్చిన హయగ్రీవ ల్యాండ్స్‌ను కూడా కొట్టేశారు. దస్పల్లా భూములను కాజేసి ఇళ్లు కట్టారు. మాజీ ఎంపీ ఎంవీవీ అనేక భూ అక్రమాలకు పాల్పడ్డారు. ఒంగోలులో నకిలీ పత్రాలతో రూ.101 కోట్ల ఆస్తి కాజేసేందుకు యత్నించారు. ఒంగోలు భూ కబ్జాలపై కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాం. తిరుపతి, రేణిగుంటలోని మఠం భూములను కొట్టేశారు. తిరుపతి జిల్లాలో భూ అక్రమాలకు లెక్కే లేదు. 22-ఏ పెట్టి భూ అక్రమాలు చేశారు. చిత్తూరులో 782 ఎకరాలు కాజేసేందుకు ప్రయత్నించారు.

పుంగనూరులో 982 ఎకరాలను పట్టా చేయించుకున్నారు. పేదవారి అసైన్డ్ భూములను లాక్కున్నారు. హౌసింగ్ కాలనీ ఎక్కడ రావాలో వైకాపా నేతలే

(మిగతా 2లో)

## నేను ప్రధాని మోదీ గుండెల్లో ఉన్నా
### పవన్ కల్యాణ్



**మంగళగిరి:** వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డుపైకి రావాలంటే భయమేసే పరిస్థితి ఉండేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల భేటీలో ఆయన మాట్లాడారు. ''గత ప్రభుత్వ హయాంలో సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టాలంటే భయం. ఇంట్లో వాళ్లపై కూడా దుర్భాషలాడిన పరిస్థితిని చూశాం. పార్లమెంటు సభ్యుడిని బంధించి కొట్టించిన తీరు చూశాం. సుదీర్ఘ అనుభవం, సీఎంగా పనిచేసిన చంద్రబాబును కూడా జైలులో పెట్టారు. అడ్డగోలుగా ఇసుక దోపిడీ, భూ కుంభకోణాలు చేశారు. అందుకే ఐదు కోట్ల మంది ఒక్కటై అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పారు.

నేను ప్రధాని మోదీ గుండెల్లో ఉన్నా.. ఆయన పక్కన నిల్చొని ఫొటో దిగాల్సిన అవసరం లేదు. అధికారం కోసం కాదు.. ప్రజల కోసం పోరాటం చేశాం. జనసేన తీసుకున్న మంత్రి పదవులు కూడా ప్రజలతో నిత్యం సంబంధం ఉన్నవి. మన పార్టీ ఎంపీలు ప్రజా సమస్యలపై పార్లమెంటులో మాట్లాడాలి. అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఎంత సాధించినా తగ్గి ఉండటం అవసరం. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కూడా ఇలాంటి మెజార్టీ రాలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నాతో అన్నారు. వైకాపా వాళ్లు మనకు ప్రత్యర్థులు మాత్రమే, శత్రువులు కాదు. చేతగాక కాదు.. కక్ష సాధింపు చర్యలు ఎవరికీ మంచిది కాదు. వైకాపా చేసిన తప్పులు మనం చేయకూడదు. అలాగని వాళ్లు చేసిన తప్పులు సహించేదిలేదు.. చట్టపరంగా చర్యలు ఉంటాయి.

జనసేన తరపున పోటీ చేసిన మొత్తం 21 మందిని గెలిపించారు.

(మిగతా 2లో)

## సమస్యలు పరిష్కరించి ప్రగతిని సాధించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగమించి, ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి, పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు కారుణ్య నియామకాలపై కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముందు కలెక్టర్ జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో కొన్ని చోట్ల తాగునీరు, మురుగునీటి సమస్య ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డీడీ, సోషల్ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. నిత్యావసర సరుకులను సకాలంలో విడిపించి, మండల స్థాయి నిల్వ కేంద్రాల్లో ఉంచాలని, రిజిస్టర్ ప్రకారం అన్ని సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి పంపిణీ చేయాలని జిల్లా సరఫరా అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పిఎమ్ విశ్వకర్మ యోజన పథకానికి భారీగా దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల అంశంపై మాట్లాడుతూ తగిన చర్యలు చేపట్టాలని ఈపిడిసిఎల్ ఎస్ఈని ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

**ఖాళీల వివరాలు అందజేయండి..**

జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను తక్షణమే అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కారుణ్య నియామకాల కొరకు సుమారు 80 వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని భర్తీ చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను నిర్దిష్ట పట్టిక ద్వారా తెలియజేయాలన్నారు. ఇప్పటికే వివరాలు సమర్పించిన అధికారులు మినహా మిగిలిన శాఖాధిపతులు తక్షణమే వివరాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కారుణ్య నియామకాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అధికారులు తూ.చ పాటిస్తూ, ఉద్యోగాల భర్తీ కొరకు అవసరమైన

(మిగతా 2లో)

## నిందితుడి బెయిల్ రద్దుకు సుప్రీం నిరాకరణ



**న్యూఢిల్లీ :** కోడికత్తి కేసులో నిందితుడు శ్రీనివాసరావు బెయిల్‌ను రద్దు చేయడానికి సుప్రీం

(మిగతా 2లో)




గౌరవనీయమైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ & వైద్య విద్య మంత్రి సత్య కుమార్ యాదవ్ ని శంకర్ ఫౌండేషన్ తరపున డిప్యూటీ మేనేజర్ (పి ఆర్ & లైజన్) కె. బంగారు రాజు, వైజాగ్ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో కలిసి సోమవారం విశాఖపట్నం విమానాశ్రయంలో స్వాగతం పలికారు. **విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్)**

## బాధిత బాలిక కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం



అమరావతి : ముచ్చుమర్రి కేసుకు సంబంధించి బాధిత బాలిక కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం అందజేయనున్నట్లు ఎపి హెూం మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. సోమవారం ఉదయం అమరావతిలో మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ అత్యాచార నిందితులను వదిలే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. ముచ్చుమర్రి కేసులో బాధిత బాలిక కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం అందజేస్తామని, మరోచోట అత్యాచారానికి గురైన బాలిక పేరుతో రూ.5 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని అన్నారు. ఆడపిల్లతో అసభ్యంగా ప్రవర్తించినవారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లాల గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై

(మిగతా 2లో)




మిహిర నక్షత్రేష్టి (1997-2024)



మాస్టర్ ఎమ్.ఆర్.ఎల్.



మేడమ్ వనజ

మిహిర 27 వార్షికోత్సవం

జూలై 19 2024
సా॥6.00 గం॥లకు

ఆహ్వానం

విశాఖ లైబ్రరీ
బివికె కాలేజి ఎదురుగా
విశాఖపట్నం.

జగద్గురువు దివ్య ఆశీస్సులతో, పరమగురువుల ప్రణాళికలతో, వ్యవస్థాపకుల అడుగు జాడలలో, మిహిర తన ప్రయాణమున 27 వర్షములు ముగించుకొని, 28వ సంవత్సరము లోనికి ప్రవేశించుచున్నది. ఏ విధముగా సూర్యుడు తన తారకవ్యూహామున, సంచరించి ఆ కాంతులను భూమిపై ప్రసరించునో, అదే సూర్యునివెలుగులో చంద్రుడు 27 నక్షత్రముల వెలుగులతో జీవసృష్టి చేయునో, మన మిహిరుడు కూడా 27 సం॥లు గురువులయొక్క బాటలో, సప్తకిరణ వ్యూహామున, తన వ్యవస్థలను, కార్యక్రములను, సేవలను, తరగతులను, పత్రికలను, శీర్షికలను మరియు గ్రంధములను అందిస్తూ, 27 విధములైన సోపానములలో నక్షత్రపదమున ప్రయాణిస్తూ 27 సం॥లుగా, నిర్విరామముగా అంతరిక్ష వ్యూహములను, ఆధ్యాత్మికప్రణాళికలను, శాస్త్రజ్ఞానమును, వైద్యవిజ్ఞానమును, చారిత్రాత్మక రహస్యములను ప్రపంచ విషయములను భవిష్యోత్తర మార్గదర్శకత్వమును అందించుచున్నారు.

ఈ శుభతరుణములో మిహిర 27వ వార్షికోత్సవమును తన విజయయాత్రను ఈ ప్రయాణమును నడిపిస్తూ, పాల్గొని సహకరిస్తున్న, భాగస్తులైన వారందరికి కృతజ్ఞతలు తెలియజేయుచున్నది. ఇందులో ఎందరో కృషిదాగియున్నది. మిహిర సంపాదక వర్గము, కార్యవర్గము, కుటుంబసభ్యులు, ప్రభుత్వ ప్రకటన కర్తలు, సహాయకులు, సభ్యులకు ప్రత్యేక అభివందనములు అర్పించుచున్నది. ఈ ప్రయాణమును సాధ్యముచేసిన పాఠకులకు, మరియు మీ అందరి అభిమానము, ప్రోత్సాహము, ఆదరణవల్లే సాధ్యపడినది. ప్రస్తుత ఆధునిక యుగములో రెండు విధములుగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రీతిలో మిహిర సేవలను అందిస్తున్నది. ఇటు మాతృభాష, అటు అంతర్జాతీయ భాషలలో పత్రికలను అందించుచున్నది.

ఈ శుభ సమయమున మిహిర వార్షికోత్సవమును జరిపి మీ అందిరి ఆశీస్సులను ఆకాంక్షిస్తూ మీరు, మీ కుటుంబసభ్యులు పాల్గొని ఈ అక్షరయజ్ఞమును ముందుకు నడిపించుటకు ఆహ్వానిస్తూ.....

ఇట్లు
మాస్టర్ ఎమ్.ఆర్.ఎల్. రావు గారి అక్షరాల పుత్రిక, అక్షర పుత్రిక

Edited, Printed and Published by : MRL Rao, for Mihira Publications, VSP-16

(మొదటి పేజీ తరువాయిలు)

## వైకాపా ప్రభుత్వం అడవులను కూడా వదల్లేదు

నిర్ణయించేవారు. ముందే స్థలం కొనేవారు.. అనేక రెట్ల పరిహారం కొట్టేసేవారు. గ్రామాల్లో ఉండే ఖాళీ భూములను ఆక్రమించారు. నివాసయోగ్యం కాని ఆవ భూములను ఇళ్లకు కేటాయించారు. అక్రమంగా భవనాలు కట్టేశారు. ప్రశ్నించే వారిపై దాడులు చేశారు. 13,800 ఎకరాలను వైకాపా ప్రభుత్వం ఆ పార్టీ నేతలకు ధారాదత్తం చేసింది. వైకాపా నేతలు తక్కువ ధరకు 40 వేల ఎకరాలు కొన్నారు. అధికారులను బెదిరించి భూములకు పట్టాలు తెచ్చుకునేవారు." అని చంద్రబాబు ఆరోపించారు.

**గుజరాత్‌లోని ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని తెస్తాం**

"భూహక్కు పత్రం పేరుతో ప్రచారానికి రూ.13 కోట్లు ఖర్చు చేశారు. భూముల రీసర్వే పేరుతో జగన్ చిత్రం ముద్రించుకున్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం మేరకు ప్రైవేటు వ్యక్తులను నియమించవచ్చు. ఎంతో అహం భావంతో ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చారు. ఆ చట్టం దురుద్దేశాలను ప్రజలు గ్రహించారు. ఒకసారి భూములను చెక్ చేసుకోవాలని ప్రజలను కోరుతున్నా. భవిష్యత్‌లో భూ కబ్జా చేయాలంటే భయపడేలా చేస్తాం. భూములు, ఆస్తులు కబ్జాకు గురైతే ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలి. గుజరాత్‌లో ఉన్న ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని ఇక్కడా తీసుకొస్తాం. తాము భూమి యజమానులమని కబ్జాదారులే నిరూపించుకోవాలి." అని చంద్రబాబు అన్నారు.

**ఇసుక దందాలో రూ.9,750 కోట్లు కొట్టేశారు**

"మైనింగ్, క్వారీ లీజుల్లో అనేక అక్రమాలకు పాల్పడ్డారు. బెదిరింపులు, భారీ జరిమానాలతో అనేక గనులు కొల్లగొట్టారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ నిబంధనలకు తూట్లు పొడిచారు. నిబంధనలు ఉల్లంఘించి గనులు తవ్వేశారు. అధికారులను డిప్యుటేషన్‌పై తెచ్చుకొని అక్రమాలకు పాల్పడ్డారు. ఇసుక తవ్వకాల్లో ప్రైవేట్ ఏజెన్సీలను తెచ్చారు. అక్రమంగా భారీ యంత్రాలు వాడారు. తవ్వకాల కోసం నదులు, కాలువలపై రోడ్లు వేశారు. ఇసుక దందాను ప్రశ్నించే వారిపై అట్రాసిటీ కేసులు పెట్టారు. కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో భారీ ఇసుక దందాలు జరిగాయి. వైకాపా నేతలకు కప్పం కట్టలేక అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇసుక దందాలో రూ.9,750 కోట్లు కొట్టేశారు.

**కుప్పంలోనూ వదల్లేదు**

ఏ ప్రభుత్వంలోనైనా అటవీ, గనులశాఖను సాధారణంగా ఒక వ్యక్తికి ఇవ్వరు. కానీ, వైకాపా హయాంలో మాత్రం ఆ రెండుశాఖలను ఒకే వ్యక్తికి అప్పగించారు. తూర్పుగోదావరి జిల్లాలో లేటరైట్ గనులను బలవంతంగా లాక్కున్నారు. ప్రకాశం జిల్లాలో 250 క్వారీలపై దాడులు చేశారు. కుప్పం నియోజకవర్గంలోనే అక్రమంగా గనులు తవ్వేశారు. దౌర్జన్యం, బెదిరింపులు, జరిమానాల పేరుతో గనులను దోపిడీ చేశారు. ఆఖరికి ద్రవిడ యూనివర్సిటీలో అక్రమంగా మైనింగ్ చేశారు. చిత్తూరు జిల్లాలో టార్గెటెడ్ ఇన్‌స్పెక్షన్ల పేరుతో వేధించారు. గనుల కేటాయింపులో పారదర్శకత తీసుకువస్తాం" అని చంద్రబాబు అన్నారు.

**అడవులను మింగిన అనకొండలను శిక్షిస్తాం**

పర్యావరణాన్ని దెబ్బతీస్తే భావితరాలు దెబ్బతింటాయని చంద్రబాబు అన్నారు. ప్రకృతి సంపద ప్రజలకు చెందాలన్నారు. "గనుల బాధితులు ముందుకు రావాలి. ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలి. అమరావతి రోడ్డుపై ఉన్న మట్టిని తవ్వుకొని పోయారు. ఎర్రచందనం దొంగ రవాణా కోసం అక్రమాలకు పాల్పడ్డారు. ఎర్రచందనాన్ని అక్రమంగా చైనాకు పంపారు. ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని తగ్గించారు. స్మగ్లర్లను ప్రోత్సహించారు. రుషికొండలో రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టారు. రుషికొండ కట్టడాలు.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే. భీమిలి ఎర్రమట్టి దిబ్బల్ని పూర్తిగా మింగేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల పరిరక్షణకు ప్రజలంతా కలిసి రావాలి. భూగర్భ ఖనిజ సంపద సమాజహితానికి వినియోగించాలి. అడవులను మింగేసిన అనకొండలను శిక్షిస్తాం." అని చంద్రబాబు అన్నారు.

### నేను ప్రధాని మోదీ గుండెల్లో ఉన్నా..
### : పవన్ కల్యాణ్

పోటీ చేసిన చోటే కాదు.. చేయని చోట్లా వీర మహిళలు, జనసైనికులు తీవ్రంగా పోరాడారు. బాధ్యతలు మోసే ప్రతి ఒక్కరికీ నేను అండగా ఉంటా. జనసైనికులు, వీర మహిళలు నావైపు బలంగా నిలబడ్డారు. ఎలాంటి పదవి ఆశించకుండా పోరాడారు. ఊహించని మెజారిటీతో గెలవడం గొప్ప విషయం. పంచాయతీల్లో బ్లీచింగ్‌కు కూడా డబ్బులు లేవు. ఏడీబీ ద్వారా నిధులు తెచ్చేందుకు మాట్లాడుతున్నాం. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరం. నేను ప్రధాని మోదీని ఇప్పటివరకూ ఏం అడగలేదు. ఇప్పుడు రాష్ట్రం కోసం అడుగుతా. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దని చెబుతా. రైల్వే జోన్ ఏర్పాటు గురించి, 25 లక్షల ఉద్యోగాలు కావాలని అడుగుతా" అని పవన్ తెలిపారు.

## సమస్యలు పరిష్కరించి ప్రగతిని సాధించాలి

విద్యార్హతలు, ఇతర అర్హతలు తదితర వివరాలు స్పష్టంగా పరిశీలించాలని చెప్పారు.

ఈ సమావేశంలో జీవీఎంసి అదనపు కమిషనర్ కె.ఎస్. విశ్వ నాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీఓ డి. హుస్సేన్ సాహెబ్,జీవీఎంసీ, పోలీస్ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడి బెయిల్ రద్దుకు సుప్రీం నిరాకరణ

కోర్టు నిరాకరించింది. ఎపి హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ ఉత్తర్వులపై జోక్యానికి అత్యున్నత న్యాయస్థానం అంగీకరించలేదు. 2019 ఎన్నికలకు ముందు విశాఖ విమానాశ్రయంలో అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌పై శ్రీనివాసరావు కోడికత్తితో దాడి చేశాడు. ఈ కేసును దర్యాప్తు చేసిన ఎన్ఐఏ.. నిందితుడిని అరెస్ట్ చేసింది. సుమారు ఐదేళ్లు జైల్లో ఉన్న శ్రీనివాసరావుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని రద్దు చేయాలంటూ ఎన్ఐఏ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు ధర్మాసనం బెయిల్ రద్దుకు నిరాకరించింది.

## బాధిత బాలిక కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం

మైనర్ బాలురు అత్యాచారం చేశారు. 14 నుంచి 16 ఏళ్లలోపు వయసున్న ముగ్గురు.. ఆ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి ఇంట్లో చెబుతుందన్న భయంతో హత్య చేసినట్లు తెలుస్తుంది. బాలిక ఆచూకీ కోసం పోలీసులు చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# జవాబుదారీతనంతో స్పందించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీదారుల సమస్యలపై జవాబుదారీతనంతో స్పందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఫిర్యాదుపై అధికారులు తీసుకున్న చర్యలతో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం ఉండాలని సూచించారు. పీజీఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమమని, దీనికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తేల్చి చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో అధికారులు జిల్లా కేంద్రం విడిచి వెళ్ళవలసి వస్తే ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఆయన స్థానంలో హాజరయ్యే అధికారులు సంపూర్ణ సమాచారం, అవగాహనతో పీజీఆర్ఎస్ కు హాజరుకావాలని కలెక్టర్ హితవు పలికారు.

కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన సోమవారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారుల వినతులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి, సంబంధిత శాఖాధికారులకు సిఫార్సు చేశారు. అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో అధికారులను ఉద్దేశించి పలు అంశాలపై కలెక్టర్ మాట్లాడారు. ఆయా విభాగాల జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడాలని, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. సంబంధిత విభాగాల పరిధిలో నమోదైన ఫిర్యాదులను పూర్తిగా పరిశీలించి, అర్జీదారులకు ఫోన్ చేసి మాట్లాడాలని, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోగా అర్జీదారుని సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్,ఏసీపీ టీ.ఎస్.ఆర్.కె.ప్రసాద్ భాగస్వాములై అర్జీదారుల నుంచి పలు వినతులను స్వీకరించారు. కాగా అన్ని విభాగాల జిల్లాస్థాయి అధికారులు, ఇతర అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

**సమస్యల పరిష్కార వేదికకు 261 వినతులు**

సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 261 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 104 ఉండగా, జీవీఎంసీకి చెందినవి 77 ఉన్నాయి. అలాగే పోలీసు శాఖకు సంబంధించి 09 వినతులు రాగా, ఇతర విభాగాలకు సంబంధించి 71 వచ్చాయి.



## పురాతన కట్టడాల పరిరక్షణలో అధికారులు విఫలం- తెలుగుదేశం

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలిలో చారిత్రిక ఆధారాలు అయిన పురాతన కట్టడాలను పరిరక్షించడం లో అధికారులు విఫలం అయ్యారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆరోపించారు. స్థానికం గా సోమవారం విడుదల చేసిన పత్రిక ప్రకటన లో ఆయన పేర్కొంటూ ఒకప్పటి ఓడరేవుగా ప్రసిద్ధిగాంచిన భీమిలి లో డాచ్ ఫ్రెంచ్, ఈస్ట్ ఇండియా కంపెనీ, బ్రిటిష్ వల్ల పాలనా కాలం నుండి స్థానికం గా ఎన్నో చారిత్రిక ప్రాధాన్యత కలిగిన పురాతన కట్టడాలుబీచ్ రోడ్ లో గల డచ్ సెమిత్రీలు , ప్లాగ్ స్మశాన వాటికలు, లైట్ హౌస్, కుమ్మరిపాలెం లో డచ్ స్మశాన వాటికలు వంటివి అనేకం ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ చరిత్రకు ఆ కట్టడాలు ప్రతి రూపాలుగా నిలిచాయని, అయితే నేడు అధికారుల నిర్లక్ష్య ఫలితం గా ఆకట్టడాలు శిథిలావస్థకు చేరడం, కట్టడాలచుట్టూ తుప్పలు బలిసి బూత్ బంగ్లా లను తలపిస్తున్నాయని ఆరోపించారు. కావునఇప్పటికయినా అధికారులు స్పందించి భీమిలో గల చారిత్రిక కట్టడాలు అయిన పూర్తి స్థాయిలో పరిరక్షించాలని ఆయన ఆ ప్రకటన లో కోరారు.

## గాయత్రీ కళాశాలలో ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక ఋషికొండ గాయత్రీ కళాశాలలో ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. SASDAL enterspriseLTD CEO శ్రీ కరి విశ్వనాధ్ ముఖ్య అతిథిగా విచ్చేసి నేటి యువతరానికి చదువుతో పాటు నైపుణ్యం కూడా ఉండాలి అని సందేశమిచ్చారు.ఈ కార్యక్రమంతో పాల్గొన్న ప్రొ.పి.రాజగణపతి గారు, గాయత్రి విద్యా పరిషత్ సభ్యులు,యువతరం తన కున్న నైపుణ్యాలను సాధన చేసి రాణించాలని సందేశం ఇచ్చారు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.కె.యస్ బోస్ గారు నైపుణ్యాలతో మంచి అవకాశాలుంటాయి అన్నారు. ఈ కళాశాల ప్రముఖులు, ప్రొ.వి.యస్. ఆర్.కె. ప్రసాద్ గారు గాయత్రి విద్యా పరిషత్ సభ్యులు,మరియు శ్రీ డి.వి.యస్. కామేశ్వర రావు గారు గాయత్రి విద్యా పరిషత్ సభ్యులు వైస్ ప్రెసిడెంట్, శ్రీ.డి.దక్షిణామూర్తిగారు తమ అమూల్యమైన సందేశాలతో యువతలో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో 150 కి పైగా విద్యార్థులు, ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వినయ్ గారు,

డా.జి. లక్ష్మినారాయణ, డా ఫ్లోరెన్స్, డా. సాయిబాల పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై అధికారులు అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్ కు వచ్చిన ప్రజలు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవించుకున్నారు. సోమవారం 247 అర్జీలు నమోదయ్యాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని కలెక్టర్ చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రతి అర్జీని అధికారులు పరిశీలించాలని, తన పరిధిలో పరిష్కరించే అంశాలపై దృష్టి సారించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చిత్తశుద్ధి, నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించాలన్నారు. మీ వద్దకు వచ్చిన బాధితులకు సాధ్యమైనంతవరకు మీ పరిధిలో న్యాయం చేయాలని. అలా చేయలేకపోతే సాధ్యం కాదని వివరిస్తూ స్పష్టంగా చెప్పాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.కార్యక్రమం చివరిలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారి "పని ప్రదేశములో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013" గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు రమామణి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం) కార్యక్రమానికి 39 ఫిర్యాదులు




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లా పోలీసు కార్యలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలి కార్యక్రమానికి వచ్చిన 39 ఫిర్యాదులలో ఆస్తి తగా దాలు, కుటుంబ కలహాలు మరియు చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు ఎస్పీ బి విజయభాస్కర్ నేరుగా ఫిర్యదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా అదనపు ఎస్పీ.విజయభాస్కర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు, ఎస్సై సావిత్రి పాల్గొన్నారు.

**పంచాంగం**

మంగళవారం 16-07-2024
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాయణం, గ్రీష్మరుతువు
ఆషాఢ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. దశమి సా. 04.54 |
| నక్షత్రం | : విశాఖ రా. 12.03 |
| వర్జ్యం | : తె. 04.17 ల 05.58 |

## రామావతారంలో జగన్నాధుడు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక ఇంద్రద్యుమ్న మందిరం లో కొలువైఉన్న జగన్నాధుడు సోమవారం రామావతారం లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్టీ, ప్రధానార్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న సుభద్ర జగన్నాధ కల్యాణ రధోత్సవాల్లో భాగం గా స్వామి వారి దశావతారాలకు సంబంధించి 8 వ రోజు స్వామి వారిని అర్చకులు రొంపిచర్ల కృష్ణమాచార్యులు రామావతారం లో సర్వాంగ సుందరం గా అలంకరించి ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి వారికి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం లో రామావతార వైశిష్ట్యం పై ఆలయ ప్రధానార్చకులు రొంపిచర్ల సింగరాచార్యులు ఆధ్యాత్మిక ప్రసంగం చేసారు.

## ముగిసిన వారాహి దీక్షలు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** స్థానిక కీటిన్ పేట వద్ద గల శ్రీ విద్యా శక్తి పీఠం లో గత 12 రోజులుగా జరుగుతున్న వారాహి దీక్షలు సోమవారం తో ముగిసాయి. విద్యాశక్తి పీఠం వ్యవస్థాపకులు సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ నెల 6న వారాహి గుప్త నవరాత్రులు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగం గా పలువురు భక్తులు వారాహి దీక్షలు చేపట్టారు. దీన్ని పురస్కరించుకొని అర్చకులు ప్రతిరోజూ ఉదయం, రాత్రి ప్రత్యేక పూజలు ప్రత్యేక ద్రావ్యాలతో హోమం నిర్వహించారు.అలాగే సోమవారం దీక్షవిరమణ సందర్భం గా మహాపూర్ణాహుతి అవబృదం వేదాశీర్వచనం చేసి భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమం లో 200 మంది భక్తులు పాల్గొన్నారు.

## సచివాలయాలకు కు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలు అందజేత



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం, జనసేన పార్టీ ల ఆధ్వర్యంలో స్థానిక 2 వ డివిజన్ పరిధి సచివాలయాలకు సోమవారం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలు అందజేసే కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలు ఉంచాలని నిర్ణయించిన దరిమిలా జనసేన పార్టీ భీమిలి జోన్ 2 వ డివిజన్ నాయకులు నందిక రోహిత్ రెడ్డి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలను సచివాలయాల సిబ్బందికి అందజేశారు. కార్యక్రమం లో ఇరు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 3 అర్జీలు

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 3 అర్జీలు అందాయి.ఈ సందర్భం గా జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం కు 1,యుసిడి విభాగం కు 2 అర్జీలు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులకు పంపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించునున్నామని ఆమె తెలిపారు.

విశాఖ సమాచారమ్

మంగళవారం 16-07-2024

# దక్షిణాయణం ప్రారంభం

సూర్యుడు కర్కాటక రాశిలోకి ప్రవేశించిన పుణ్యకాలం. ఈరోజునుండి దక్షిణాయణం ప్రారంభం అవుతుంది. సంక్రమణం ప్రవేశించిన తరువాత మొదటి 6గంటల 49నిమిషములు పుణ్యకాలంగా, 2గంటల 16నిమిషములు అత్యంత పుణ్యకాలంగా శాస్త్రములందు చెప్పబడింది. ఆ సమయంలో స్నాన, దాన, జపాదులేవైనా అధిక ఫలితాలనిస్తాయి.

అయనం అనగా ప్రయాణము. ఈశాన్యం నుంచి భూమధ్యరేఖకు సూర్యుడు పయనించే సమయాన్ని ఉత్తరాయణం అంటారు. ఆగ్నేయం నుంచి భూమధ్య రేఖకు సూర్యుడు పయనించే సమయాన్ని దక్షిణాయణం అంటారు. సూర్యుడు ఈశాన్యానికి ప్రయాణించుటకు ఆరునెలలు, ఆగ్నేయానికి ప్రయాణించుటకు ఆరునెలల సమయం పడుతుంది.

ప్రాచీన గ్రంథాల ఆధారంగా ఉత్తరాయనం అనగా మకర సంక్రమణం నుంచి కర్కటక సంక్రమణం వరకు దక్షిణాయణం అనగా కర్కటక సంక్రమణం నుంచి మకర సంక్రమణం వరకు.

ఒక సంవత్సరాన్ని ప్రమాణంగా తీసుకున్నప్పుడు దక్షిణాయనము, ఉత్తరాయణము అను రెండు పేర్లతో నడుస్తుంది. ఉత్తరాయణము (మానవుని ఆరునెలల కాలము) దేవతలకు ఒక్కరోజుతోను, దక్షిణాయనము (మానవుని ఆరునెలల కాలము) ఒక రాత్రితోను సమానము. అవిధంగా మానవుని సంవత్సరము దేవతలకు ఒక దినముతో సమానము. ఈ దక్షిణాయణంలో మహావిష్ణువు నిద్రిస్తాడని, ఉత్తరాయనంలో మేల్కొంటాడని హిందువుల నమ్మకము. వారు ఉతరాయణాన్ని ప్రశస్తమైనదిగా భావిస్తారు. సనాతన భారతీయులు దక్షిణాయనంలో దేవతల అనుగ్రహం కావాలని అందువల్లనే పండుగలు, ఉపవాసాలు, యజ్ఞయాగాదులు ఈ కాలంలోనే ఎక్కువగా చేసెడివారు. భీష్మపితా మహునికి స్వచ్ఛంద మరణ వరం ఉన్నది. అందువల్ల ఆయన సూర్యుడు ఉత్తరాయనంలోకి ప్రవేశించి నప్పుడు మరణమాసన్నమయ్యే విధంగా తీసుకున్నారు. శయన ఏకాదశికి హిందువులు ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను ఇచ్చారు. ఈరోజు మహావిష్ణువు నిద్రకు ఉపక్రమిస్తారు. ఈ రోజు నుంచి హిందువులు చాతుర్మాస దీక్షను ప్రారంభించి మహావిష్ణువు మేల్కొనే సమయానికి అనగా నవంబర్ లో వచ్చే ప్రభోద ఏకాదశితో ముగిస్తారు.

శాస్త్రీయంగా చూస్తే దక్షిణాయణంలో సూర్య కిరణాలు చాలా తక్కువగా ఉంటాయి. దీనివల్ల ఆ సమయంలో మనుష్యులకు రోగనిరోధక శక్తి, అరుగుదల శక్తి తక్కువగా ఉంటుంది. దాని కారణంగా ఈ ఉపవాసములు, ధ్యానం, దేవతారాధన అనే సంప్రదాయాలు, ఆచారములు మన పెద్దలు మనకు సూచించారు. ఈ ఆచారములు శరీరంలోని నిరోధకశక్తిని పెంచుతాయి.

# వేగి వీధి విద్యుత్ సమస్యలు పరిష్కరించిన అధికారులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ పరిధిలోని 81వ వార్డులోని వేగి వీధి ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు కొత్త ట్రాన్స్ఫరము ఏర్పాటుచేసి విద్యుత్ అధికారులు సోమవారం సమస్య పరిష్కరించారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు వేగి కృష్ణ వేగి సూరిబాబు ఆధ్వర్యంలో స్థానిక వేగి విధి మహిళలు గత కొన్ని నెలలుగా వేగి వీధిలో కరెంటు కోతలు వల్ల కలుగుతున్న ఇబ్బందులను పార్టీ రాష్ట్ర నాయకులు మళ్ళ సురేంద్ర కలిసి సమస్యలు తెలియజేయగా, వెంటనే కరెంట్ ఆఫీస్ కి వెళ్లి ఏఈ రాజేంద్రప్రసాద్ కి వినతిపత్రం అందించి తక్షణమే సమస్యని పరిష్కరించాలని కోరారు. స్పందించిన విద్యుత్

ఏఈ రాజేంద్రప్రసాద్ చర్యలు తీసుకున్నారు. మళ్ళ సురేంద్ర, వేగి కృష్ణ, వేగి సూరిబాబు, దగ్గరుండి కొత్త ట్రాన్స్ఫరం వేయించి సమస్యను పరిష్కరించారు.


# అనకాపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లా నాగభూష ణము ఆధ్వర్యంలో పట్టణంలో రోజు,రోజుకు పెరిగి పోతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని,రోడ్డు ప్రమాదాలు జరుగ కుండా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక జి.వి.ఎం.సి.కార్యాలయం వద్ద ప్లకార్డులుతో నిరశన ప్రదర్శన నిర్వహించారు.అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కారం లో భాగముగ జి.వి.ఎం.సి. కార్యాలయంలో స్థానిక జి.వి.ఎం.సి.జోనల్ కమీషనరు ఒమ్మి అయ్యప్పనాయుడు కి సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూష ణము వినతి పత్రం అంద జే సి పట్టణం లో గల ట్రాఫిక్ సమస్యలు,ప్రజలు పడుతున్న ఇబ్బందులను గూర్చి వివరించారు.ఈ సందర్భముగ బల్లా నాగభూష ణము మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాగ ఏర్పడి నాలుగు సంవత్సరాలు అయిందని , అలాగే జిల్లాలో నే గాక పట్టణ జనాభా విపరీతం గా పెరగటం ఒక ప్రక్క వాహనాల రద్దీ మరొక ప్రక్క రోడ్లను, ఫుట్ పాత్ లను ఆక్రమించి వ్యాపారాలను సాగించటం, పట్టణంలో గల రద్దీగా ఉన్న మెయిన్ జంక్షన్ లలో చాలా చోట్ల ట్రాఫిక్ సిగ్న ల్స్ లేక పోవడం, సెల్లార్ లలో కూడా వ్యాపారాలు సాగించడం వంటి అనేక ట్రాఫిక్ సమస్యల తో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ఈ సమస్యల పరిష్కారం కోసం జి.వి.ఎం.సి.అధికారులుపోలీసు శాఖ వారు తక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు రక్షణ,భద్రతలను కల్పించాలనివిజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన జి.వి.ఎం.సి.జోనల్ కమీషనరు ఒమ్మి అయ్యప్ప నాయుడు గారు ఈ విషయం లపై పోలీసు శాఖ వారితో చర్చించి తగిన చర్యలు చేపట్టి పరిష్కారం కోసం కృషి చేస్తా నని హామీ ఇచ్చారని బల్లా నాగభూష ణము తెలియ చేసారు..

ఈ కార్యక్రమము లో సంస్థ ఉపాధ్యక్షుడు వినకోట నీలేశ్ గుప్తా సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావుకార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, కాపారపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సెలవుల్లో శిలాఫలకం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర యూనివర్సిటీ డాక్టర్ వి ఎస్ కృష్ణ లైబ్రరీ నందు శని వారం సెలవు రోజు కావడంతో శిలాఫలకాన్ని ఎవ్వరూ లేని సందర్భంలో ఏర్పాటు చేయటాన్ని ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది ఇది సోది గంగాలో 10000 పిహెచ్‌డి అప్లోడ్ చేసినందు కుగాను ఈ శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు ప్రస్తుతం v.c.prof. pvgd ప్రసాద్ రెడ్డి మరియు ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ పేర్లతో ఈ శిలాఫలకాన్ని ఏర్పాటు చేయటానికి విచిత్రంగా పరిగణిస్తున్నారు వారు ఇద్దరూ కూడా రాజీనామా చేసిన సంగతి తెలిసిన విషయమే మరియు ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ ఇంచార్జ్ అనే విషయం మరిచినారు.వెంటనే శిలాఫలకాన్ని తొలగించాలని లేనిపక్షంలో ఆందోళన చేయటానికి సిద్ధంగా ఉన్నావని డాక్టర్ ఎం సురేష్ మీనన్ అధ్యక్షుడు ఆంధ్ర యూనివర్సిటీ పరిరక్షణ సమితి తెలియచేస్తున్నారు.

# బుద్ధ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ జగన్నాథుడు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** శ్రీ జగన్నాథ స్వామి రథోత్సవంల భాగంగా. స్థానికగూడ్స్ రోడ్ వద్ద ఉన్న ఇంద్రజమ్ము హాలు వద్ద కొలువైన సుభద్రా బలభద్ర సమేత జగన్నాథ స్వామి వారు సోమవారం భక్తులకు బుద్ధావతారం లో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఉత్సవ్ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి( వైభవ్), ఆలయం ఈవో రాజ సులోచన ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు., ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ,డైరెక్టర్లు. బొండా రమేష్, అనకాపల్లి మోహన్ రావు, బోడ్డేడ వెంకట చలపతిరావు, కాంద్రేగుల వెంకట వీర అప్పారావు, బుగత కోటేశ్వరరావు, యల్లమల్లి ధనలక్ష్మి, బుద్ధ లక్ష్మీ అప్పారావు, శరగడం కృష్ణ , భక్తులు తదితరులు పాల్గొన్నారు. జబర్దస్త్ ఫేమ్ సత్తిపండు జగన్నాథ స్వామిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బుజ్జి సత్తిపండుకు స్వాగతం పలికి స్వామివారి కి పూజలు చేయించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్తిపండును బుజ్జి సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటకు బృందాలను సత్తిపండు అభినందించారు. కార్యక్రమంలో దాడి వాసు ఆలయ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# బయెకెమిస్ట్రీ విభాగంలో జాతీయ సదస్సు నిర్వహణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఏయూ టిఎల్ఎన్ సభామంది రంలో ' ట్రెండ్స్ ఇన్ ఎమర్జింగ్ నానో బయోటెక్నాలజీ-కరెంట్ అప్లికేషన్స్ అండ్ ఫ్యూచర్ ప్రొస్పెక్ట్స్' అంశంపై జాతీయ సదస్సును నిర్వహించారు. సదస్సుకు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్ రాజు అధ్యక్షత వహించారు. నేవల్ సిస్టమ్స్-మెటీరియల్స్,డిఆర్‌డిఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు. నానో బయో టెక్నాలజీ రంగంలో నూతన పోకడలు, ఆవిష్కరణలను వివరించారు. కార్యక్రమంలో ఐఐసిటి-సిఎస్ఐఆర్ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ చిత్తరంజన్ పాత్ర విశిష్ట అతిధిగా హాజరై కీలకోపన్యాసం అందించారు. అనంతరం డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుశీల, ఆచార్య పి.రాధికలు శాస్త్రీయ అంశాలపై ప్రసంగించారు. ఏయూ ఐపిఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం పేటెంట్‌లు సాధించడం, ప్రాముఖ్యతను తెలియజేశారు. సదస్సు కన్వీనర్-ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య పి.రాధిక సదస్సును సమన్వయం చేశారు. కార్యక్రమంలో ఆచార్య టి.రాఘవ రావు, డాక్టర్ పి.సుభాషిణి దేవి, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల పోస్టర్ ప్రజెంటేషన్ యువత ఆలోచనలకు వేదికగా నిలచింది.

# దుష్ప్రచారాలు బెదిరింపులకు భయపడేది లేదు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఒక మహిళా అధికారిణి విషయంలో తనపై చేసిన దుష్ప్రచారంపై ఎంపీ విజయ సాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళ విషయంలో తనపై అవాస్తవాలు, ఆధారాలు లేని ప్రచారం చేశారని మండిపడ్డారు.తనపై కొన్ని టీవీ ఛానళ్లు దుష్ప్రచారం చేశాయని, వార్తను ప్రసారం చేసే ముందు వారి వివరణ తీసుకోకుండా, ఆధారాలు లేకుండా టెలికాస్ట్ చేశారని, తన మీద దుష్ప్రచారం చేసిన వారితో క్షమాపణలు చెప్పిస్తానన్నారు. ఆయన సోమవారం అశిల మెట్ట వద్ద గల హోటల్ మేఘాలయలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ వారు కూడా కొంత మంది తనపై దుష్ప్రచారం చేశారన్నారు.

తాను కింద స్థాయి నుంచి జీవితంలో ఎదిగానని, 8ఎకరాల భూమి ఉన్న కుటుంబం నుంచి తాను జీవితంలో ఎదిగానన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి తాను వచ్చానని తనపై దుష్ప్రచారం చేసిన వాళ్లందరి జీవితాలు తనకు తెలుసన్నారు. బ్లాక్మెయిల్ చేసి తాను సంపాదించలేదని, వేంకటేశ్వరుడి సాక్షిగా తాను తప్పు చేసే ప్రసక్తే లేదన్నారు. ఎంపీగా బాధ్యతలు నిర్వర్తించే క్రమంలో అంతరాలు లేని సమాజం కోసం పనిచేస్తున్నానని చెప్పారు. ఆదివాసీ మహిళతో సంబంధాన్ని అంటగట్టిన వారు వాటిని రుజువు చేయాలని, కుట్ర, కుతంత్రాల వెనుక ఎవరున్నారో అందరి సంగతి తెలుస్తానన్నారు. తన మీద దుష్ప్రచారం చేసిన వారందరి సంగతి తేలుస్తానన్నారు. తన మీద దుష్ప్రచారం చేసిన అందరికి బుద్ధి చెబుతానన్నారు. యూట్యూబ్ ఛానల్స్, సోషల్ మీడియా దుష్ప్రచారాలపై కూడా లీగల్ చర్యలు తీసుకుంటానన్నారు.

పార్లమెంటు సభ్యుడిగా తన హక్కుల్ని కాపాడుకోడానికి తనపై దుష్ప్రచారం చేసిన వారిపై ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఎడిటర్స్ గిల్డ్, పార్లమెంట్, నేషనల్ ఉమెన్ కమిషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్, ఏపీ ఎస్టీ కమిషన్, డిఫమేషన్ కేసులు కూడా ఫైల్ చేస్తానని చెప్పారు. రాజ్యాంగ బద్ధమైన సంస్థలన్నింటిలో తాను పోరాడతానన్నారు. ఆదివాసీ ఆడబిడ్డను బజారుకీడ్చిన చర్యలుతీసుకుంటానన్నారుసోషల్ మీడియాలో నకిలీ జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతానని సాయిరెడ్డి ప్రకటించారు.

2024 ఎన్నికల పరిణామ క్రమంలో ఓ పద్ధతి ప్రకారం ఎలా కుట్రలు జరుగుతున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలని విజయసాయిరెడ్డి అన్నారు. వైసీపీ ఓటమిపై సమీక్షించుకుంటున్నామని, దానిపై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై కసరత్తు చేస్తున్నామని, ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు 175 స్థానాల్లో11 స్థానాలు తాము దక్కిన తర్వాత తాము అధికారం నుంచి తప్పుకున్నామని చెప్పారు.

అధికారంలోకి వచ్చిన పార్టీ గుండాలు వైసీపీకి చెందిన ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతూ, కొడుతున్నారని, కుటుంబాలను హింసిస్తూ అకృత్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోలీసుల మద్దతుఉందనే అహంకారంతో ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయిస్తున్నారని, కుటుంబాలను తరిమేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ఇచ్చే ప్రజాస్వామ్య బద్ధమైన పరిపాలన ఇదేనా అని ప్రశ్నించారు. ఒక్క నెలలోనే రాక్షస పాలనను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు.

**బెదిరింపులకు భయపడేది లేదు**

వైసీపీ నాయకుల మీద బురద చల్లడం, క్రమబద్ధంగా బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. తన పేరు ప్రఖ్యాతలు దెబ్బతీయడానికి ప్రయత్నించిన వారు ఎంతటి పెద్ద వారైనా వదిలే ప్రసక్తి లేదన్నారు.

ఆదివారం ఇద్దరు వ్యక్తులు మోటర్ సైకిల్ తమ ఇంటికి వచ్చారని, విజయసాయిరెడ్డి ఉన్నాడా పారిపోయాడా అని అడిగారని, టీడీపీ గుండా వచ్చి తన ఇంటి ముందుకు వచ్చి ప్రశ్నించాడని, తాను ఎక్కడికి పారిపోలేదని, టైమ్ చెబితే తాను ఒక్కడినే వెళ్తానని సవాలు చేశారు.

తాను తాటాకు చప్పుళ్లకు భయపడే వాడిని కాదన్నారు. తన ఇంటికి వచ్చిన వాడు టైమ్ చెబితే తానే వస్తానన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఏ కూటమి అధికారంలో ఉన్నా, తాము ప్రతిపక్షంలో ఉన్నా భయపడే ప్రసక్తి లేదన్నారు. మళ్లీ ఐదేళ్లలో వైసీపీ అధికారంలోకి వస్తుందని, మధ్యంతరం వస్తే మళ్లీ తామే అధికారంలోకి వస్తామన్నారు. తోక జాడించే వారి తోకలు కత్తిరిస్తామన్నారు.

గతంలో తాను టీవీ ఛానల్ పెట్టాలని భావించానని, కానీ జగన్ వారించడంతో ఆగిపోయానని, ఇప్పుడు ఖచ్చితంగా న్యూట్రల్ చానల్ ఒకటి అతి త్వరలో తీసుకు వస్తానని సాయిరెడ్డి ప్రకటించారు.

తనపై ఆరోపణలు చేసిన మదన్‌మోహన్ రెండు సార్లు స్కాలర్‌షిప్ కోసం తన దగ్గరకు వచ్చాడని అంతకు మించి అతనితో ఎలాంటి పరిచయం కూడా లేదన్నారు. ఓ మీడియా ఛానల్ యజమానితో కలిసి అతను ఈ కుట్ర పన్నాడని, దీనిపై పార్లమెంటులో న్యాయ పోరటం చేస్తానని ప్రకటించారు.

**ఎప్పుడో విడాకులు తీసుకున్నాం: ఏసి శాంతి**

మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి ఆదివారం రాత్రి స్పందించారు. 2013 నవంబర్ లో మదన్‌మోహన్‌తో తనకు పెళ్లి అయ్యిందని, తమకుఇద్దరు కవల పిల్లలు ఉన్నారని, 2015లో పిల్లలు పుట్టారని ఆమె వివరించారు. నేషనల్ ఓవర్ సీస్ స్కాలర్ షిప్ తాము ఇంటర్వ్యూ కి వెళ్ళామని, లా విద్యను అభ్యసిస్తుండగా మదన్ మోహన్ మానిపాటి అప్పటికే కేంద్ర ప్రభుత్వం ఉద్యోగిగా ఉన్నాడని, పెళ్లైన తర్వాత అతను నన్ను దారుణంగా హింసించాడని ఆరోపించారు.

రెండేళ్ల పాటు తన భర్త దారుణంగా హింసించాడని ఆరోపించారు. భర్త వేధింపులు భరించలేక 2016 లోనే తాము ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం విడాకులు రాసుకున్నామన్నారు. గిరిజన సంప్రదాయం ప్రకారం విడాకులు రాసుకున్నామని, 2016 లో మదన్ మోహన్ యూఎస్ వెళ్ళిపోయాడని, 2020లో తనకు ఉద్యోగం వచ్చిందని, తాను, న్యాయవాది సుభాష్ ఇద్దరం ఇష్టపడి పెళ్లి చేసుకున్నామని చెప్పారు. అతని ద్వారా తాను మరో బిడ్డను కన్నట్టు చెప్పారు. సుభాష్ తల్లి సమ్మతంతోనే తమ పెళ్లి జరిగిందని, తన ఇద్దరు పిల్లలు, సుభాష్ కుమార్తెను కలిసి పెంచాలనే సమ్మతితో తమ పెళ్లి జరిగిందన్నారు.

సుభాష్ తో తన పెళ్లి జరిగిన తర్వాత కూడా వేధించారని ఆరోపించారు. మదన్ మోహన్, తాను విశాఖపట్నం కోర్టులో విడాకులు కి తీసుకున్నామని చెప్పారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ తర్వాత ప్రభుత్వ ఉద్యోగం లో చేరానని, గిరిజన మహిళ ని కాబట్టి నన్ను టార్గెట్ చేశారని, ఎంపీ విజయసాయిరెడ్డి ని నేను విశాఖపట్నం లోనే చూశానని చెప్పారు.

తండ్రిలాంటి సాయిరెడ్డిపై దుష్ప్రచారం చెయ్యడం అత్యంత దారుణమన్నారు. విజయసాయిరెడ్డి తో కేవలం డిపార్ట్‌మెంటల్ విషయాలే మాట్లాడానని, ఏ ఆఫీసర్ ఎంపీలు, ఎమ్మెల్యేలు తో మాట్లాడకూడదా అన్నారు. ఆంధ్రజ్యోతి లో 100 కోట్లు సంపాదించాను అని రాశారని, అందుకు మదన్ మోహన్ నన్ను 75 కోట్లు అడిగారని, గిరిజన మహిళని అని కక్ష గట్టి నన్ను సస్పెండ్ చేశారన్నారు.

తన మీద పెట్టిన అభియోగాల్లో 8 అసలు తనకు సంబంధించినవే కాదని, ఇద్దరు అడబిడ్డలు ఉన్న తన వక్తిత్వ హననం చేశారని, మదన్ మోహన్ 2016లోనే తనకు విడాకుల ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడన్నారు. 2016 నుండి నేను మదన్ మోహన్ తో సంసారం చెయ్యలేదని, 30 కోట్లు కావాలని మదన్ మోహన్ డిమాండ్ చేసేవాడని మీడియా నా బిడ్డను అక్రమ సంతానం అనడం దారుణమని, సుభాష్ ను పెళ్ళి చేసకున్న తర్వాత బిడ్డ పుట్టాడన్నారు.

అడ్వకేట్ దగ్గర ఎంఓయూ రాసు కున్నప్పుడు కూడా మదన్ మోహన్ ఆ బిడ్డ తన బిడ్డ కాదని లిఖితపూర్వకంగా కూడా రాశాడని, ఆ తర్వాత తనను వేధించడంతో కేసు కూడా పెట్టానన్నారు. మదన్ మోహన్ అమెరికా అక్రమంగా వెళ్ళాడని, అతనిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానన్నారు. గర్భిణీగా ఉన్నప్పుడు కూడా ఆమెను కొట్టేవాడని ఆరోపించారు. మీడియా సమావేశంలో డిప్యూటీ మేయర్ కటుమూరు సతీష్, కొండా రాజీవ్ గాంధీ, కే కే రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అర్థరైటిస్ ఉంటే వ్యాయామం చేయవచ్చా..?



ప్రపంచవ్యాప్తంగా చాలా మంది అర్థరైటిస్ సమస్యతో బాధపడుతున్నారు. కానీ చాలా తక్కువ మందికి మాత్రమే దీని గురించి తెలుసు. అర్థరైటిస్అంటే..కీళ్ళనొప్పి. సాధారణంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కీళ్ల దగ్గర నొప్పి, వాపు, అవి గట్టిగా (స్టిఫ్‌గా) మారడాన్ని, ఆయా కీళ్లలో కదలికలు తగ్గడాన్ని 'అర్థరైటిస్'గా చెప్పవచ్చు. ఈ సమస్యల తీవ్రత సాధారణంగా ఉదయం పూట ఎక్కువగా ఉంటుంది. దీన్ని మొదట్లో గుర్తిస్తే.. అదుపులో ఉంచుకోవడం సాధ్యం. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా శరీర వైకల్యాలు రావచ్చు. మన దేశంలో 180 మిలియన్లకు పైగా అర్థరైటిస్ కేసులు ఉన్నాయి. డయాబెటిస్, ఎయిడ్స్, క్యాన్సర్ సహా ఇతర వ్యాధుల కంటే అర్థరైటిస్ సమస్య తీవ్రంగా ఉందనే చెప్పుకోవాలి. అర్థరైటిస్ సమస్య ఇంత ఎక్కువగా ఉన్నా.. ప్రజలలో దీనిపై ఎన్నో అపోహలు ఉన్నాయి.

**అర్థరైటిస్ ఎన్ని రకాలు..**

అర్థరైటిస్ ఎముకలు, వాటి కణజాలాలకు సంబంధించిన సమస్య. అర్థరైటిస్‌లో 100కు పైగా రకాలు ఉన్నాయి. అయితే ఇందులో ఆస్టియో అర్థరైటిస్, రుమటాయిడ్ అర్థరైటిస్, యాంకైలోజింగ్ స్పాండైల్ అర్థరైటిస్, గౌట్, జువెనైల్ ఇడియోపథిక్ అర్థరైటిస్ (పిల్లల్లో వచ్చే అర్థరైటిస్), లూపస్, సోరియాటిక్ అర్థరైటిస్ వంటివి కొన్ని.

**అర్థరైటిస్ ఎందుకు వస్తుంది..** అర్థరైటిస్‌లో ప్రధానంగా ఆస్టియో అర్థ్రయిటిస్, రుమటాయిడ్ అర్థ్రయి టిస్ అని రెండు రకాలు ఉంటాయి. వృద్ధాప్యంలో మోకాలు, తుంటి కీళ్లు అరగటం వల్ల ఆస్టియో అర్థ్రయిటిస్ వస్తుంది. రుమ టాయిడ్ అర్థ్రయిటిస్‌లో రోగనిరో ధకశక్తి ఎదురు తిరగడంవల్ల కీళ్ల దగ్గరున్న కణాలన్నీ ఇన్‌ఫ్లమేషన్‌కి గురై వాచిపోతాయి. చేతులూ వేళ్లూ మణికట్టూ కాళ్లూ... ఇలా కీళ్ల భాగాలతోపాటు శరీరంలోని ఇతర కణజాలాలూ కండరాలమీదా దీని ప్రభావం ఉంటుంది. దాంతో పిత్తాశయం, ఊపిరితిత్తుల సమస్యల తోపాటు రక్తహీనత, లో బీ1, మలబద్ధకం వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇన్ఫెక్షన్ల కారణంగా సొరియాటిక్, సెప్టిక్, థంబ్... వంటి ఇతరత్రా అర్థ్రయిటిస్ వ్యాధులూ వస్తుంటాయి. వంశపారంపర్యంగా గానీ, ఆటలు ఆడేటప్పుడు తగిలిన గాయాలవల్లో, ఊబకాయం కారణంగా కీళ్లమీద బరువు ఎక్కువ పడటం, పోషకాహార లోపం, శారీరక శ్రమ, కాల్షియంలోపం, నిద్రలేమి, జీవక్రియాలోపాలు, ఒత్తిడి, డిప్రెషన్.. .ఇలా అనేక కారణాల వల్ల అర్థ్రయిటిస్ సమస్యలు వస్తుంటాయి.

**లక్షణాలు..** అర్థరైటిస్ లక్షణాలు అందరిలోనూ ఒకేలా ఉండవు. మొదటిదశలో ఆకలి తగ్గడం, జ్వరం, బాగా నీరసించిపోవడం, బరువు తగ్గడం వంటివి కనిపిస్తాయి. చేతులు, కాళ్లలోని కీళ్లలో నొప్పులు, వాపులు ఉంటాయి. కీళ్లు ఎర్రగా కమిలినట్లుగా ఉండి, విపరీతమైన నొప్పివస్తాయి. ప్రత్యేకించి ఉదయం పూట నొప్పి ఉంటుంది.

**వృద్ధులకే వస్తుందా..?** అర్థరైటిస్‌లో చాలా రకాలు ఉన్నాయి. ఇది వృద్ధులలో ఎక్కువగా కనిపిస్తుంది. కానీ ఇది పిల్లలలో, యువకులనూ ప్రభావితం చేస్తుంది. పిల్లలలో జువైనల్ ఇడియోపతిక్ అర్థ్రయిటిస్ వస్తుంది. ఇది 16 ఏళ్ల కన్నా చిన్నవారిలోనే వస్తుంటుంది. ఎక్కువ గా 2-4 ఏళ్ల వయసులో కనిపిస్తుం టుంది. ఇది కీళ్లను శాశ్వతంగా దెబ్బతీస్తుంది.

**కీళ్ల నొప్పులన్నీ.. అర్థరైటిస్ కారణంగానేనా..?** స్నాయువు, కాపు తిత్తుల వాపు,ఇతర మృదు కణజాల గాయాలతో సహా అనేక వ్యాధులు కీళ్ల నొప్పులకు కారణమవుతాయి అర్థరైటిస్ మాదిరిగానే నొప్పి వస్తాయి. మీకు ఏ రకమైన నొప్పివస్తుందో.. సరిగ్గా నిర్ధారించుకోండి.

**కీళ్లనొప్పులు వాటికవే తగ్గుతాయా..?** అర్థరైటిస్‌ను మొదట్లోనే గుర్తించి, చికిత్స తీసుకుంటే మంచిదని డాక్టర్ బీరెన్ నాదకర్ణి అంటున్నారు. రుమటాయిడ్ అర్థరైటిస్‌ను నిర్లక్ష్యం చేస్తే కారణంగా గుండె, రక్తనాళాలు, మెదడు, చర్మం, కళ్లు, ఊపిరితిత్తులను దెబ్బతీస్తుంది. సరైన సమయంలో చికిత్స తీసుకుంటే.. దీర్ఘకాలిక ప్రభావాలను నివారించవచ్చు.

**అర్థరైటిస్ ఉంటే వ్యాయామం చేయవచ్చా..?** అర్థరైటిస్ ఉన్నవారు వ్యాయామం చేయవచ్చని డాక్టర్ బీరెన్ నాదకర్ణి అన్నారు. వ్యాయామం వాపు, అసౌకర్యాన్ని తగ్గిస్తుంది. కదలికలను, కీళ్ల బలాన్ని, ఫ్లెక్సిబిలటీని పెంచుతుంది. మీకు శారీరక శ్రమ లేకపోతే.. లక్షణాలు అధ్వాన్నంగా మారే అవకాశం ఉంది. ఏ వ్యాయామం చేసినా.. మీ లిమిట్ తెలుసుకోవడం మంచిది. ట్రైనర్ పర్యవేక్షణలో వ్యాయామం చేయండి.

**హీట్ ప్యాడ్‌తో నొప్పి తగ్గుతుందా..?** కూల్, హీట్ ప్యాడ్‌లు రెండూ కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం ఇస్తాయి. కూల్ ప్యాట్ కీళ్ల వాపు, నొప్పిని తగ్గిస్తుంది. మీకు కీళ్లు నొప్పిగా ఉన్నప్పుడు, వ్యాయామం చేసే ముందు హీట్ ప్యాట్ పెట్టుకుంటే రిలీఫ్‌గా ఉంటుంది.

**ఈ జాగ్రత్తలు తీసుకోండి..** మన లైఫ్‌స్టైల్‌లో కొన్ని మార్పులు చేసుకున్నా.. అర్థరైటిస్ లక్షణాల నుంచి ఉపశమనం పొందవచ్చని డాక్టర్ బీరెన్ నాదకర్ణి అన్నారు. రోజూ వ్యాయామం చేస్తూ, పోషకాహారం తీసుకుంటే మంచిదని అన్నారు.

# ఈ 5 స్టెప్పులతో ముఖం మెరుస్తుంది



కనీసం నెలకు ఒకసారైనా ఫేషియల్ మీ ముఖానికి మెరుపును అందించడానికి గొప్ప మార్గం. తమ ముఖ సౌందర్యాన్ని కాపాడుకోవడంలో శ్రద్ధ వహించే వారికి ఫ్రూట్ ఫేషియల్ అంటే చాలా ఇష్టం. బెర్రీస్‌లో యాంటీఆక్సిడెంట్లు మరియు అద్భుతమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది మీ చర్మానికి అద్భుతాలు చేస్తుంది. మీ ముఖాన్ని కాంతివంతం చేయడానికి వివిధ రకాల పండ్లను ఉపయోగించవచ్చు.

చాలా మంది బ్యూటీ పార్లర్‌కు బ్యూటీ ట్రీట్‌మెంట్ కోసం వెళ్తుంటారు. అయితే ఇంట్లోనే మీ ముఖం కోసం కొన్ని పనులు సులభంగా చేసుకోవచ్చు. మీరు ఇప్పుడు ఒక్క పైసా ఖర్చు లేకుండా ఇంట్లోనే ఫ్రూట్ ఫేషియల్‌ను సిద్ధం చేసుకోవచ్చు. దాని కోసం ఇక్కడ కొన్ని సాధారణ దశలు ఉన్నాయి. సెలబ్రిటీ ట్రెండ్‌ను అనుసరించి, మీరు ఇంట్లోనే కొన్ని ఫ్రూట్ ఫేషియల్‌లను ప్రయత్నించవచ్చు. మీ చర్మాన్ని ఆరోగ్యంగా మరియు మెరిసేలా చేయడానికి ఇంట్లోనే ఫ్రూట్ ఫేషియల్ చేయడానికి దశల వారీ మార్గాలు ఇక్కడ ఉన్నాయి.

ముఖానికి ఫ్రూట్ ప్యాక్ ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే పండ్లు మీ చర్మానికి ఆక్సీకరణ నష్టం జరగకుండా కాపాడతాయి. అలాగే విటమిన్ ఎ పుష్కలంగా ఉండే పండ్లను తినడం వల్ల మొటిమలను తగ్గించుకోవచ్చు. బొప్పాయి, పుచ్చకాయ మరియు నిమ్మకాయ వంటి పండ్లలో ఉండే ఎంజైమ్‌లు శక్తి ఉత్పత్తులుగా పనిచేస్తాయి మరియు ముఖాన్ని పునరుజ్జీవింపజేయడంలో సహాయపడతాయి. పండ్లలో తేమ పుష్కలంగా ఉంటుంది కాబట్టి అవి మీ చర్మానికి పోషణనిస్తాయి. పండ్లు మీ చర్మం యొక్క స్థితిస్థాపకతను మెరుగుపరచడంలో సహాయపడతాయి, ఇది హైడ్రేట్‌గా ఉంచుతుంది మరియు అకాల ముడతలు మరియు చర్మం వృద్ధాప్యాన్ని తగ్గిస్తుంది.

ఫ్రూట్ ప్యాక్ ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలు పండ్లు మీ చర్మంలోని మురికిని తొలగించడం ద్వారా చర్మ రంధ్రాలను బిగుతుగా ఉంచడంలో సహాయపడతాయి. ఫ్రూట్ ఫేషియల్స్ వాటి హైడ్రేటింగ్ లక్షణాలతో మీ చర్మానికి కొత్త జీవితాన్ని తిరిగి అందించడంలో సహాయపడతాయి. పుచ్చకాయ మరియు అవకాడో చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి కొన్ని ఉత్తమమైన పండ్లు. నారింజ వంటి పండ్లు మొటిమలతో పోరాడటానికి గ్రేట్ గా సహాయపడుతాయి మరి యు వాటిలో ఉండే విటమిన్ సి చర్మానికి పోషణనిస్తుంది. స్ట్రాబెర్రీలు మరియు కివీస్ వంటి పండ్లలో ఉండే యాంటీ-టానింగ్ ఏజెంట్లు సహజంగా అసమాన టాన్లను వదిలించుకోవడానికి సహాయపడతాయి. నేచు రల్ ఫ్రూట్ ఫేషియల్స్ మీ చర్మాన్ని ప్రకాశవంతంగా మరియు శక్తివంతం చేయడానికి సహాయపడతాయి.

స్టెప్ 1 - పాలతో చర్మాన్ని శుభ్రపరచండి చర్మంపై పేరుకుపోయిన మురికిని తొలగించడానికి లోతైన శుభ్రతతో మీ చర్మాన్ని సిద్ధం చేయడం ద్వారా ప్రారంభించండి. మీరు మీ చర్మాన్ని శుభ్రపరచడానికి చల్లని, పచ్చి పాలను ఉపయోగించవచ్చు. ఇది రంధ్రాలను శుభ్రం చేయడానికి బాగా పనిచేస్తుంది. మీ ముఖాన్ని నీటితో కడిగిన తర్వాత, ఒక గిన్నె చల్లటి పాలను తీసుకుని, కాటన్ క్లాత్‌తో పాలను మీ ముఖం మరియు మెడపై అప్లై చేయండి. దీన్ని 10 నిమిషాల పాటు అలాగే ఉంచి తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

స్టెప్ 2 - నిమ్మ తొక్కలతో ఎక్స్‌ఫోలియేట్ చేయండి చర్మంలోని మురికిని తొలగించిన తర్వాత మీరు చనిపోయిన చర్మ కణాలను కూడా తొలగించాలి. మీ చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడానికి మీకు స్క్రబ్ అవసరం. ఎండిన నిమ్మ తొక్కలను ఉపయోగించి మీరు సహజ స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. నిమ్మ తొక్కలను గ్రైండ్ చేసి, నీళ్ళు పోసి పేస్ట్ లా చేయాలి. ఈ పేస్ట్‌ను వృత్తాకార కదలికలో మీ కళ్ళ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని నివారించండి. సుమారు 5 నిమిషాల పాటు ఈ ప్రక్రియను కొనసాగించండి మరియు ఇది చనిపోయిన చర్మ కణాలను శాంతముగా తొలగించడానికి సహాయపడుతుంది. మీ ముఖాన్ని మళ్లీ నీటితో బాగా కడగాలి.

స్టెప్ 3 - ఆవిరి మరియు ఓపెన్ రంధ్రాలను చర్మ రంధ్రాలను తెరవడం ఖచ్చితంగా ఒక ముఖ్యమైన దశ. ఎందుకంటే కాలక్రమేణా అక్కడ మురికి తగిలి పెద్దదవుతుంది. ఫేషియల్ స్టీమర్‌ని ఉపయోగించడం వల్ల మీ చర్మ రంధ్రాలను తెరవవచ్చు. మీకు మీ స్వంత ఫేషియల్ స్టీమర్ లేకపోతే, మీరు ఒక గిన్నె నీటిని మరిగించి, దాని నుండి ఆవిరి పట్టవచ్చు. సుమారు 10 నిముషాల పాటు ఆవిరి పట్టి, ఆపై మందపాటి గుడ్డతో మీ ముఖాన్ని తుడవండి. ఇది బ్లాక్‌హెడ్స్‌ను తొలగించడంలో కూడా సహాయపడుతుంది.

స్టెప్ 4 - ఫ్రూట్ ప్యాక్ చేయండి పండ్ల ప్యాక్ తయారు చేయడం చాలా సులభం. అయితే, మీరు మీ చర్మాన్ని బట్టి ప్యాక్‌ని సిద్ధం చేసుకోవాలి. మీ చర్మం ఆధారంగా మీరు తయారు చేసుకోగల ప్యాక్‌లు ఇక్కడ ఉన్నాయి. డ్రై స్కిన్ - మీకు పొడి చర్మం ఉంటే అరటిపండు మరియు తేనె కలిపి ప్యాక్ చేయండి. యాంటీ ఏజింగ్ - మీ చర్మం బిగుతుగా మరియు ముడతలు పడినట్లయితే, బొప్పాయి గుజ్జు మరియు తేనెతో ప్యాక్ చేయండి. జిడ్డుగల చర్మం - మీరు జిడ్డుగల మరియు మొటిమలకు గురయ్యే చర్మం కలిగి ఉంటే, బెర్రీలు మరియు నిమ్మరసంతో ప్యాక్ చేయండి. సాధారణ చర్మం ఉన్నవారు ఈ ప్యాక్‌లలో దేనినైనా ఉపయోగించవచ్చు.

స్టెప్ 5 - ఫ్రూట్ ప్యాక్‌ని అప్లై చేయండి మీ చర్మ రకాన్ని బట్టి ప్యాక్‌ను తయారు చేసిన తర్వాత, మీ ముఖం మరియు మెడపై సున్నితంగా అప్లై చేయండి. మీ వేళ్లతో ముఖాన్ని మసాజ్ చేయండి. లైట్ ప్రెజర్ అప్లై చేసి పైకి మసాజ్ చేయండి. మీ ముఖాన్ని 5 నిమిషాలు మసాజ్ చేసిన తర్వాత, ఈ ప్యాక్‌ను మరో 10 నిమిషాలు ఉంచండి. మరింత రిఫ్రెష్ ప్రభావం కోసం మీరు మీ కళ్ళను గులకరాళ్ళతో కప్పుకోవచ్చు. చివరగా మీ ముఖాన్ని నీటితో శుభ్రంగా కడుక్కోండి మరియు మీ చర్మంపై తక్షణ మెరుపు కనిపిస్తుంది. ఉత్తమ ఫలితాల కోసం నెలకు ఒకసారి లేదా 15 రోజులకు ఒకసారి ఫ్రూట్ ఫేషియల్ చేయండి.

# ఈ ఆకు వేసి అన్నం వండితే బిర్యానీలా ఉంటుందట



సాధారణంగా పులావ్, బిర్యానీ చేసేటప్పుడు కొన్ని ఎక్స్‌ట్రా మసాలాలు యాడ్ చేస్తాం. కొన్ని బిర్యానీ మసాలాలని అన్నంలో వేస్తాం. ఇవి మామూలు అన్నానికి మరింత రుచిని తీసుకొస్తాయి. అవన్నీ ప్రతిసారి వేయలేం కానీ, బిర్యానీ ఆకు అయితే వేయొచ్చుగా. అవును బిర్యానీ ఆకు అన్నం ఉడికేటప్పుడు వేసి చూడండి. మామూలు అన్నం కంటే రుచి అమాంతం పెరుగుతుంది. దీనిని వేయడం వల్ల రుచి మాత్రమే కాదు. ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు నిపుణులు. ఇందులో బిర్యానీ ఆకులోని గొప్ప గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

సాధారణంగా బిర్యానీ ఆకులో విటమిన్ ఎ, బి6, విటమిన్ సి వంటి ముఖ్య పోషకాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా ఇమ్యూనిటీని పెంచి జీవక్రియను మెరుగు చేస్తాయి. ఇందులోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లు, అలెర్జీలను తగ్గిస్తాయి. డిజిటల్ జర్నల్ వెబ్ ఎమ్‌డిలో ప్రచురించిన ఓ అధ్యయనం ప్రకారం, బిర్యానీ ఆకుల్లో స్టెఫిలోకాకస్ ఆరియస్, ఇ కోలి వంటి బ్యాక్టీరియాను దూరం చేసే గుణాలు ఉంటాయి. దీంతో ఎన్నో సమస్యలు దూరమవుతాయి. అంతేకాకుండా, బిర్యానీ ఆకుల్లో అల్సర్, క్యాన్సర్‌కి కారణమయ్యే బ్యాక్టీరియా హెచ్‌పైలోరితో కూడా పోరాడే గుణాలు ఉన్నాయని తెలిపింది. అంతే కాదండోయ్ వీటిలో గుణాలు ఒత్తిడి, ఆందోళనను కూడా దూరం చేస్తాయి.

**ఎలా వేయాలి..** మనం అన్నం ఉడికించేటప్పుడు కుక్కర్ అయినా, గిన్నెలో అయినా బిర్యానీ ఆకులను వేయాలి. అన్నం ఉడికాక ఈ ఆకుని తీసేయొచ్చు. బిర్యానీ చేసేటప్పుడు మామూలుగా ఎలాగూ మసాలా వేసే టైమ్‌లోనే ఇది వేస్తాం కదా. ఈ ఆకు వేయడం వల్ల రుచి వస్తుంది. నార్మల్‌గా అన్నం వండేటప్పుడు క్వాంటిటీని బట్టి ఒకటి, రెండు వేస్తే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల ప్లేయిన్ రైస్ కూడా బిర్యానీ ఫ్లేవర్‌తో రుచి, వాసనతో నోరూరిస్తుంది.

# పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా?



చైల్డ్ హుడ్ లుకేమియా: లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) అనేది ప్రపంచవ్యాప్తంగా యుక్తవయస్కులు, పిల్లలలో సర్వసాధారణమైన క్యాన్సర్. ప్రారంభ రోగ నిర్ధారణ, సకాలంలో చికిత్స చాలా ముఖ్యం అయినప్పటికీ, పెద్దల కంటే పిల్లలు ప్రారంభ చికిత్సకు సానుకూలంగా స్పందిస్తారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అసలు ఈ బ్లడ్ క్యాన్సర్ అంటే ఏమిటి..? బ్లడ్ క్యాన్సర్ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? అన్న అంశాలపై ఇంటర్నేషనల్ క్యాన్సర్ ఆర్గనైజేషన్ నిర్వచించిన అధ్యయంన ప్రకారం.. లుకేమియా అనేది తెల్ల రక్త కణాలను ప్రభావితం చేసే క్యాన్సర్. మన శరీర రోగనిరోధక వ్యవస్థలో తెల్ల రక్తకణాలు ముఖ్యమైన భాగం. క్యాన్సర్ ఈ కణాలను ప్రభావితం చేసినప్పుడు, ఎముక మధ్యలో అసాధారణ తెల్ల కణాలు ఏర్పడతాయి. ఇది రక్తప్రవాహం ద్వారా శరీరంలోని ఇతర భాగాలకు వెళ్లి ఆరోగ్యకరమైన కణాలను నాశనం చేస్తుంది. ఈ ఆరోగ్యకరమైన కణాలు క్షీణించినప్పుడు, ఇన్ఫెక్షన్, వ్యాధులు పెరుగుతాయి. శరీరం బలహీనపడుతుంది. పిల్లలు, యుక్తవయస్కులు అటువంటి అంటువ్యాధులతో పోరాడటానికి పెద్దల కంటే బలంగా స్పందిస్తారు. పిల్లలు, యువకుల శరీరాలు క్యాన్సర్ చికిత్సలకు మెరుగ్గా స్పందిస్తాయని గుర్తించారు.

**పిల్లలలో బ్లడ్ క్యాన్సర్:** ప్రమాద కారకాలు లుకేమియా కుటుంబ చరిత్రను కలిగి ఉండటం వలన పిల్లలలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. దీనిని లి-ఫ్రొమెని సిండ్రోమ్ అంటారు. దీని అర్థం వంశపారంపర్య క్యాన్సర్ ప్రమాదం. ప్రభావితమైన జన్యువుల ఆధారంగా పిల్లలకు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. పిల్లవాడు ఇంతకు ముందు ఏదైనా రేడియేషన్ థెరపీకి గురైనట్లయితే, లేదా బెంజీన్ వంటి రసాయనాల అధిక వినియోగానికి గురైనట్లయితే, లుకేమియా అభివృద్ధి చెందే ప్రమాదం పెరుగుతుంది.

**పిల్లలలో బ్లడ్ క్యాన్సర్ లక్షణాలు ఏమిటి?** చాలా మంది పిల్లలకు లుకేమియా అసాధారణ లక్షణాలు లేవు. ఇది రోగనిరోధక సంబంధిత వ్యాధి. రాజీపడిన రోగనిరోధక వ్యవస్థ కలిగిన ఎవరైనా అనుభవించే ప్రతిదీ లుకేమియా బాధితులలో కూడా కనిపిస్తుంది.

**విపరీతమైన అలసట:** పిల్లవాడు అన్ని సమయాలలో అలసిపోయినట్లు, ఇతర పిల్లలతో ఆడుతున్నప్పుడు అకస్మాత్తుగా అలసిపోయినట్లు అనిపిస్తే, ఇది రోగనిరోధక వ్యవస్థ సమస్యకు సంకేతం కావచ్చు. పిల్లవాడు ఏదైనా కఠినమైన పనులు చేయలేకపోవటం, ఎప్పుడు చూసిన బలహీనంగా ఉన్నట్లయితే వెంటనే దాన్ని తగిన వైద్య పరీక్షలు చేయించాలి.

**రక్తస్రావం లేదా గాయాలు:** పిల్లలకి తరచుగా గాయాలు ఉంటే, అవి త్వరగా నయమయ్యేలా లేదా నయం కావడానికి చాలా సమయం తీసుకుంటే టెస్టులు చేయించాలి. పిల్లలకి రక్తస్రావం ఉంటే, వెంటనే వైద్య సహాయం తీసుకోండి.

**ఇన్ఫెక్షన్ , జ్వరం:** ఇన్ఫెక్షన్, జ్వరం అనేది పిల్లలు పెద్దలలో అన్ని రకాల క్యాన్సర్ల సాధారణ లక్షణం. పిల్లలకి నిరంతర జ్వరం ఉంటే, జ్వరం చాలా కాలం పాటు తగ్గకపోతే, వెంటనే ఆయా టెస్టులు చేయించాల్సి ఉంటుంది. మీకు తరచుగా ఇన్ఫెక్షన్లు మరియు జ్వరాలు ఉంటే, సాధారణ మందులతో సరిగ్గా తగ్గకపోయినా, తరచుగా వైద్యుడిని సంప్రదించాల్సి ఉంటుంది. వెంటనే పరీక్షలు చేయించుకోవాలి.

**శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు:** మీరు తరచుగా లేదా నిరంతర దగ్గు లేదా శ్వాస తీసుకోవడంలో ఎటువంటి అంతర్లీన శ్వాసకోశ సమస్యలు లేకుండా ఉంటే జాగ్రత్తగా ఉండండి. లుకేమియాతో పోరాడుతున్న పిల్లలకి విలక్షణంగా లేని ఇతర లక్షణాలు ఉన్నాయి. వీటిలో చిగుళ్ల సమస్యలు, శరీరంపై దద్దుర్లు, వేగంగా బరువు తగ్గడం, శరీరంలోని ఏదైనా భాగంలో వాపు, కీళ్ల నొప్పులు, తిమ్మిర్లు, తలనొప్పి, నిరంతర వాంతులు ఉన్నాయి. మంచి జీవనశైలిని గడపడం, మీ పిల్లల కోసం ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్లాన్ చేయడం ఏ తల్లిదండ్రులకైనా మొదటి ప్రాధాన్యతగా ఉండాలి. ముఖ్యంగా కోవిడ్ అనంతర కాలంలో ఇవి మరీ తప్పనిసరి.

# మీ గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ ఇలా చేయండి



ఉరుకులు పరుగుల జీవితంలో జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా గుండె రోగాలు వస్తుంటాయి. గుండె శరీరంలో అతి ముఖ్యమైన అంగం. అందుకే గుండెను పరిరక్షించుకోవల్సిన బాధ్యత ఉంది. తెలిసో తెలియకో చేసే తప్పులు ఆ గుండెను అనారోగ్యానికి గురి చేస్తాయి.

రోజువారీ జీవితంలో చాలా సార్లు అనారోగ్యకరమైన పదార్థాలు తీసుకుంటుంటాం. ఇవి గుండె ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుంటాయి. అందుకే ఇటు గుండెతో పాటు అటు శరీరంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరం. ముఖ్యంగా అధిక కేలరీలు, సోడియం ఉండే ఆహార పదార్థాల్ని దూరం పెట్టాలి. ఎందుకంటే ఇవి స్థూలకాయం, డయాబెటిస్, హృద్రోగం వంటి సమస్యలకు దారితీస్తాయి. ఈ వ్యాధుల్నించి దూరంగా ఉండాలంటే ఈ ఆహార పదార్థాలను దూరంగా ఉంచాలి.

కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. ఇందులో మనిషి శరీరానికి కావల్సిన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. కూరగాయలు, పండ్లలో కేలరీలు తక్కువగా ఉండి..ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కూరగాయలు, పండ్లు, ప్లాంట్ ఫుడ్స్ గుండె రోగాల్ని నియంత్రించడంలో దోహదపడతాయి. అందుకే మీ డైట్‌లో ఆకు పచ్చని కూరగాయల్ని చేర్చాలి.

ఇక తృణ ధాన్యాల్లో ఫైబర్ మోతాదు అధికంగా ఉంటుంది. ఇందులో పోషక పదార్థాలు కూడా ఎక్కువే. బ్లడ్ ప్రెషర్, గుండె సంబంధిత వ్యాధుల్ని తగ్గిస్తాయి. ప్రోసెస్డ్ ఫుడ్‌ను దూరంగా పెట్టి..ఆ స్థానంలో తృణ ధాన్యాల్ని చేర్చాలి.

మీరు తినే ఆహారంలో ఉప్పు విషయంలో జాగ్రత్త అవసరం. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటుకు గురవుతారు. ఇది గుండెపోటు ముప్పును పెంచుతుంది. ఉప్పు వాడకాన్ని తగ్గించడం ద్వారా వ్యాధుల్ని దూరం చేయవచ్చు.

# వైజాగ్ వారియర్స్ కు 10 లక్షల నజరానా ప్రకటించిన డా. నరేంద్ర రామ్




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రా ప్రీమియర్ లీగ్ 2024లో వైజాగ్ వారియర్స్ ఛాంపియన్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. విశాఖపట్నంలోని ACA-VDCA ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో వైజాగ్ వారియర్స్ ఉత్తరాంధ్ర లైయన్స్ తో తలపడింది.

13 జూలై 2024న జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ వారియర్స్ 190 పరుగుల సవాలు లక్ష్యాన్ని నిర్దేశించింది. ధీటైన ప్రయత్నం చేసినప్పటికీ, ఉత్తరాంధ్ర లయన్స్ 16.3 ఓవర్లలో 102 పరుగులకు ఆలౌటైంది, వైజాగ్ వారియర్స్ 87 పరుగుల విజయాన్ని అందుకుంది.

వైజాగ్ వారియర్స్ సహ-యజమాని మరియు లైఫ్‌స్పాన్ యజమాని అయిన డాక్టర్ నరేంద్ర రామ్, వారి అద్భుతమైన ప్రదర్శనకు ప్రశంసల చిహ్నంగా జట్టుకు రూ. 10 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్ర రామ్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు మరియు వైజాగ్ వారియర్స్ జట్టు సభ్యులకు, క్రీడా సిబ్బందికి, మీడియా మరియు స్పాన్సర్లకు తన అభినందనలు తెలిపారు. డాక్టర్ నరేంద్ర రామ్ జట్టు వెనుక ఒక ముఖ్యమైన ప్రేరణ శక్తిగా ఉన్నారు.

ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో. తొలుత బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ అశ్విన్ హెబ్బార్ 56 బంతుల్లో 91 పరుగులు, మునీష్ వర్మ 27 బంతుల్లో 37 పరుగుల మద్దతుతో అద్భుతమైన స్కొరు 189/5 స్కొరు చేసింది. బౌలింగ్‌లో పి మణికంఠ గంగాధర్ 3/17తో ఆకట్టుకోగా, కె. సుదర్శన్, జాగర్లపూడి రామ్ చెరో 2 వికెట్లు తీశారు. అత్యద్భుత ఆటతీరుతో అశ్విన్ హెబ్బార్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. టోర్నీ మొత్తం, అశ్విన్ హెబ్బార్ 456 పరుగులతో టాప్ స్కొరర్‌గా నిలిచాడు, కె సుదర్శన్ 14 వికెట్లతో బౌలింగ్ చార్టులలో అగ్రస్థానంలో ఉన్నాడు. అశ్విన్ హెబ్బార్ గౌరవనీయమైన ఆరెంజ్ క్యాప్‌ను కూడా పొందాడు మరియు ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా ఎంపికయ్యాడు.

# సింహాచలంలో పంచ గ్రామాల సమస్య తీరుస్తాం. : గంటా



భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ ఎంవిపి కాలనీలో గల తన నివాసంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 30రోజుల్లో 30 మంచి పనులు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు వేగవంతం అయ్యేలా పనులు మొదలు పెట్టారు.

పోలవరం పనులు వేగవంతం అయ్యాయి. గిరి ప్రదక్షిణ పై మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తాం. ఐదేళ్ళలో విశాఖ ఉక్కు లో కార్మికులు బితుకు బితుకు మంటూ కార్మికులు గడిపారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి స్వయంగా వచ్చి ఉక్కు సమస్య పై సమీక్ష జరిపి కార్మికులకు భరోసా ఇచ్చేలా మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా సాదా సీదా తీరుగా వ్యవహరిస్తున్నారు. ఏ హంగులు ఆర్భాటాలు లేకుండా ప్రజలకు చేరువగా ఉన్నారు. ప్రజా హర్షం సొంతం చేసుకుంటున్నారు.

విశాఖ అభివృద్ధిలో భాగంగా మెట్రో బీచ్ రోడ్ అభివృద్ధి మీద దృష్టి పెట్టారు. "విశాఖ వైకాపా నేతల భూ అక్రమాలు మీద విశాఖ భూఅక్రమాలు మీద ప్రభుత్వం దృష్టి పెట్టింది అన్నారు. వైకాపా నేతలు ఎవ్వరెవ్వరు ఈభూఅక్రమాలు చేశారో వారిపై నివేదికలు ఇవ్వమన్నారు.

వైజాగ్ ఫైల్స్ గా ఒక రిపోర్ట్ తయారు చేస్తాం. సింహాచలంలో పంచ గ్రామాల సమస్య తిరుస్తాం. బిఆర్‌టిఎస్ రోడ్డు సమస్య ఉంది. టి డి అర్ సమస్య కూడా పరిష్కరిస్తాం. దేవాదాయశాఖ అధికారి శాంతి గతంలో విశాఖ లో పనిచేశారు.

వారి పైన స్వయంగా ఆమె భర్త ఫిర్యాదు చేశారు. శాంతి పైన కూడా ఫిర్యాదులు ఉన్నాయి, వారిని ఇప్పటికే సస్పెండ్ చేశారు. వచ్చిన ఆరోపణలు పై విజయ సాయి రెడ్డి కూడా స్పందించాలి. ఇప్పటికే దేవాదాయశాఖ మీద ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మీద విచారణ చేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చినా కొందరు అధికారుల్లో వైసిపి పురిటి వాసనలు ఇంకా పోలేదు. అన్ని విభాగాల్లో కింద స్థాయి నుంచి అధికారులు మారవలిసిన అవసరం ఉంది అన్నారు. మీడియా సమావేశంలో భీమిలి టీడీపీ ఇన్చార్జి కోరాడ రాజ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఈమా ఆధ్వర్యంలో బీచ్ క్లీన్




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఈవెంట్ మేనేజర్ల అసోసియేషన్ (ఈమా) విశాఖ చాప్టర్ సారథ్యంలో బీచ్ క్లీన్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఆర్కే బీచ్ నుంచి విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న బీచ్ వరకు ఈవెంట్ మేనేజర్లు, యాంకర్లు, సింగర్లు, డాన్సర్లు , రోటరీ క్లబ్ ప్రతినిధులు, బిజినెస్ నెట్వర్క్ ఆఫ్ ఇంటర్నేషనల్( బి ఎన్ ఐ) సభ్యులు, తమైరా స్కిన్ క్లినిక్ డాక్టర్లు, వైజాగ్ వాలంటీర్స్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. జీవీఎంసీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి ఈమా అధ్యక్ష కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్ సారథ్యం వహించారు. అనంతరం మొత్తం 200 మంది సభ్యులు బీచ్ వాక్ దాన్ చేపట్టారు. అనంతరం విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా గల గ్రౌండ్లో సభ్యులందరూ విద్యార్థులతో కలిసి జుంబా నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఈమా కార్యవర్గ సభ్యులు సురేష్ బాబు, జి ఎన్ రాజు, సంతోష్ కుమార్ (ప్రేమ రాజ్), కామేష్ పాలూరి, ఆశా పట్నాయక్, జగదీష్, తమైరా స్కిన్ క్లినిక్ డాక్టర్ జ్యోతి స్వరూప్, రాంకోర్ సంస్థ ఉమేష్, ఈవెంట్ మేనేజర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాడి రవికుమార్, సీనియర్ ఈవెంట్ మేనేజర్ వర్మ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

# వెలుగు సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం.. ముఖ్యఅతిథిగా ఎంపీపీ పైల




పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ వెలుగు కార్యాలయంలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం యొక్క సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023-2024 సం నందు వివిధ శాఖల నందు చేపట్టిన పనుల పైన వివిధ శాఖల అధికారులతో సామాజిక తనిఖీ చేసి పనులను సామాజిక తనిఖీ సిబ్బంది పారదర్శకంగా చేపట్టవలనని మరియు సామాజిక తనిఖీ చేయవలసిన ఉపాధి హామీ పథకం కూలీలకు ఇంకా మెరుగ్గా ఉపయోగపడుతుందని తెలియజేసినారు. మండలంలో జరిగిన పనుల్లో భాగంగా వేతనాలు తదితర అంశాలపై అధికారులు సోషల్ ఆడిట్ చేసి డిఆర్పీలు నివేదికలు సమర్పించారు. సామాజిక తనిఖీ ప్రజావేదికలో క్షేత్ర స్థాయి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, విధి నిర్వహణలో అలసత్వం వద్దని పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరవాడ ఏపీవో గోవిందా రావు, వసంత్, ఎంపీడీవో కీర్తి స్పందన, హౌసింగ్ ఏఈ రెడ్డి, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, నాయుడు పాలెం సర్పంచ్ కుంద్రాపు వరలక్ష్మి సీతారామయ్య , సుపెరిండెంట్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ లు, టెక్నికల్ అసిస్టెంట్ లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధ్వజస్తంభం

మత సంబంధమైన ప్రార్థనల వంటి కార్యక్రమాలకు వినియోగించే కట్టడం. దాదాపు అన్ని మతాలలోను ఇవి పవిత్రమైన ప్రదేశాలుగా భావింపబడుతాయి. 'దేవుడు' లేదా 'దేవత' ఉండే ప్రదేశం గనుక 'దేవాలయం' అని పిలువబడుతుందని అర్థం చేసుకోవచ్చును. వివిధ మతాలలో దేవాలయాలకు చెందిన అనేక సంప్రదాయాలు, నిర్మాణ రీతులు, నిర్వహణా విధానాలు ఉన్నాయి. శ్రీ వైఖానస శాస్త్రం ప్రకారం భక్తజనుల సౌకర్యార్థం భగవంతుడు అర్చారూపియై భూలోకానికి వచ్చాడు. ప్రతి దేవాలయంలోను ద్వారపాలకులు, పరివార దేవతలు, ప్రాకార దేవతలు ఆయా స్థానాలలో ఆవాహన చేయబడిఉంటారు. చారిత్రికంగా దేవాలయం చాలా ప్రాధాన్యత కలిగివుంది. సా.శ. 1వ శతాబ్ది నాటి నుంచి నిర్మింపబడిన అనేక దేవాలయాలు దక్షిణ భారతదేశంలో కనిపిస్తుంటాయి. వీటి వలన హిందూయుగపు చరిత్రను అవగాహన కలిగి, వ్రాసేందుకు చరిత్రకారులకు ఉపయోగపడుతున్నాయి.

ఆలయాలు అయిదు రకాలుగా ఉన్నాయి.

స్వయంవ్యక్త స్థలాలు - భగవంతుడే స్వయంగా అవతరించినవి.

దివ్య స్థలాలు - దేవతలచే ప్రతిష్ఠ చేయబడినవి.

సిద్ధ స్థలాలు - మహర్షులు, తపస్సుచేసి సిద్ధి పొందిన స్వాములు ప్రతిష్ఠించినవి.

పౌరాణ స్థలాలు - పురాణాలలో చెప్పబడి ప్రసిద్ధిగాంచినవి.

మానుష స్థలాలు - రాజుల చేత, భక్తుల చేత ప్రతిష్ఠ చేయబడినవి.

**దేవాలయ నిర్మాణం.**

దేవాలయాలలో గాలి గోపురం, ప్రధాన ద్వారం, వైకుంఠ ద్వారం, ధ్వజ స్తంభం, గర్భగుడి, ద్వారపాలకులు, వంటశాల మొదలైన వివిధ భాగాలుంటాయి. ఆగమ శాస్త్రములో దేవాలయాలలో అర్చకులు, భక్తులు, అధికారులు ఏ విధముగా వ్యవహరించకూడదో వివరించబడింది.

ఆలయం లోపల వాహనము మీదగానీ, పాదరక్షలతో గాని తిరుగరాదు. ఆలయానికు ప్రదక్షిణం చేసిన, పిమ్మట లోనికి ప్రవేశించాలి. ఆలయంలోనికి తలపాగా ధరించిగాని, చేతితో ఆయుధం పట్టుకొనిగాని ప్రవేశించరాదు. ఆలయంలోనికి ఉత్తచేతులతోగాని, తిలకం ధరించకుండా గాని, తాంబూల చర్వణం చేస్తూగాని, ఆహారాదులు తినుచూగాని ప్రవేశించరాదు. ఆలయ ప్రాంగణంలో మల, మూత్ర విసర్జన చేయరాదు. ఆలయముందు కాళ్ళు చాపుకొని కూర్చుండుట, నిద్రపోవుట చేయరాదు. ఆలయంలో ఏ ప్రాణికైనా దుఃఖం కలిగించే ఏ హింసనూ చేయరాదు. ఆలయంలో ఎన్నడూ వివాదాలు పెట్టుకోరాదు. ఆలయంలో అహంకారముతో, గర్వముతో, అధికార దర్పముతో ఉండరాదు. ఆలయంలో దేవుని ఎదుట పర స్తుతిని, పర నిందను కూడా చేయరాదు. ఆలయంలో దేవుని ఎదుట పృష్ఠభాగం చూపిస్తూ కూర్చుండరాదు. అధికార గర్వంతో అకాలంలో ఆలయం ప్రవేశించి అకాల సేవలను చేయరాదు. ఒక చేతితో ప్రణామం చేయరాదు. ఆలయాలలో ఇతరులకు నమస్కరించడం చేయరాదు. భగవంతుని ఎదుట అందరూ సమానులే అని భావించవలెను. దేవాలయాలలో రకాలుమార్చు శివుడు స్థాపించబడిన దేవాలయం - శివాలయం. విష్ణువు లేదా విష్ణుఅంశచే స్థాపించబడిన దేవాలయం - విష్ణాలయం శ్రీరాముడు స్థాపించడిన దేవాలయం - రామాలయం సూర్యనారాయణమూర్తి స్థాపించబడిన దేవాలయం - సూర్యాలయం సుబ్రహ్మణ్య స్వామి స్థాపించబడిన దేవాలయం - సుబ్రమణ్యస్వామి ఆలయం వేంకటేశ్వరుడు స్థాపించబడిన దేవాలయం - వేంకటేశ్వరాలయం ధ్వజ స్తంభం .హిందూ దేవాలయాలలో ఒక భాగం. ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణం చేసిన తరువాత దైవదర్శనం చేసుకోవటం ఆచారం.ధ్వజ స్తంభం దగ్గర కొట్టే గంటను బలి అంటారు. ఒకప్పుడు అడవిలో దారి తప్పిన బాటసారులకు ఎత్తున కనిపించే ధ్వజస్తంభ దీపాలే దారి చూపించేవి. వీటి ఆధారంగా, ఏ గుడినో, పల్లెనో చేరుకొని ప్రజలు అక్కడ తలదాచుకొనేవారు. ఇప్పుడా అవసరం లేకపోయినా కార్తీకమాసములో ప్రజలు ధ్వజస్తంభం మీద ఆకాశదీపం వెలిగించి మహాదాత మయూరధ్వజుని గౌరవిస్తున్నారు.ఇంటి ముందు ఎవరైనా అడ్డంగా నిలబడితే, ఏమిటలా ధ్వజస్తంభంలా నిల్చున్నావు అంటుంటారు.కానీ ఆలయమనే దేహానికి గర్భాలయాన్ని ముఖంగాను, ధ్వజస్తంభాన్ని హృదయంగాను పోలుస్తారు.ఆలయ ప్రాకారాలు చేతులవంటివి. నిత్యహారతులు జరిగే దేవాలయాలలో షోడశోపచార పూజావిధానం జరగాలంటే ధ్వజస్తంభం తప్పనిసరి.దీపారాధనలు, నైవేద్యం వంటి ఉపచారాలు ధ్వజస్తంభానికి కూడా చేయాలి.దేవాలయాలలో నిర్మలమైన వాతావరణం, భగవద్ధ్యానం వంటివి మానసిక ప్రశాంతత కలిగిస్తాయి.ఆలయంలో మూలవిరాట్టు ఎంత ముఖ్యమో ధ్వజస్తంభం కూడా అంతే ముఖ్యం.ధ్వజస్తంభం ఉంటేనే దేవాలయానికి ఆలయత్వం ఉంటుంది. లేకపోతే అవి మందిరాలు అవుతాయి. పూర్తయిన విగ్రహాన్ని కొంతకాలం ధాన్యంలో దాచుతారు. దానిని ధాన్యాధివాసం అంటారు. అలా కొన్నాళ్లు గడిచాక తీసి నీళ్లలో దాచుతారు. దానిని జలాధివాసం అంటారు.

మూల విరాట్టు దృష్టికోణానికి ఎదురుగా దేవాలయాలలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తారు. బాగా చేవ కలిగిన కొన్ని రకాలైన వృక్షశాఖలను మాత్రమే ధ్వజస్తంభానికి ఉపయోగిస్తారు. వీటిని ప్రతిష్ఠ చేసే ముందు ఈ దారువు (చెక్క) ను కూడా నీళ్లలో, ధాన్యంలో ఉంచి ఆ తరువాత ప్రతిష్ఠ చేస్తారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ కూడా విగ్రహ ప్రతిష్ఠతో సమానమే. మూలవిరాట్టుకు ఎంత ప్రాధాన్యం ఇస్తారో ధ్వజస్తంభానికి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తారు. మూల విరాట్టు గర్భాలయంలో ఉంటే ధ్వజస్తంభం దేవాలయానికి ముందు భాగంలో బయట ఉంటుంది. ఆలయంలోనికి ప్రవేశించగానే ముందుగా ధ్వజస్తంభాన్ని దర్శించకుండా మూల విరాట్టు ను చూడకూడదు. ధ్వజస్తంభం లేని దేవాలయాలకు స్వాములు, సన్యాసులు దేవాలయ గుర్తింపు ఇవ్వరు. ధ్వజస్తంభానికి జీవధ్వజం అని మరో పేరు ఉంది. దీనిని దారు బేరం అని కూడా అంటారు. విగ్రహాల అనుష్ఠాన, అర్చనల వల్ల భగవంతుని చూపు ఈ ధ్వజస్తంభానికి తగులుతుంది. అందువల్ల ఈ స్తంభానికి పవిత్రతతో పాటు, శక్తి కూడా లభిస్తుంది. ధ్వజస్తంభానికి కూడా బలిహరణాలు, అర్చనలు జరుగుతుంటాయి. పలాస - మోదుగ, అశ్వత్థ - రావి, బిల్వ - మారేడు, బంధూకం - వేగిస, పనస - పనస, వకుళ - బొగడ, అర్జున - మద్ది, నారవేప.

సోమిద వృక్షాలను ధ్వజస్తంభాల కోసం ఉపయోగించినట్లయితే అవి కొన్ని సంవత్సరాల పాటు బలంగా ఉంటాయి. పాడైపోయినవి, ఛిద్రమైనవి, వేరే పనుల కోసం వినియోగించే వృక్షాలను దీనికి వాడకూడదు. ధ్వజస్తంభం పొడవు విమాన చక్రం అంత ఎత్తు ఉన్నది మాత్రమే తీసుకురావాలి. ధ్వజస్తంభానికి కింద కూర్మయంత్రం వేయాలి. వైష్ణవాలయాలలో పైన పతాకంలాగ మూడు వరసల్లో జెండా ఎగురుతున్నట్టు ఉంటుంది. ఇలా మూడు బద్దలుగా ఉన్న భాగాన్నిమేఖల అంటారు. దానికి చిరుగంటలు ఉండి చిరుగాలికి సవ్వడి చేస్తుంటాయి. ధ్వజస్తంభం నిడివి 12 అంగుళాల నుంచి 24 అంగుళాల వరకు ఉండచ్చు. చెక్కతో తయారుచేసిన ఈ ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు వేస్తారు. కొన్ని కొన్ని దేవాలయాలో వెండితో, బంగారంతో కూడా తొడుగు చేయిస్తారు. ఈ తొడుగును మేఖలకు కూడా వేస్తారు. మేఖల కింద సుదర్శన చక్రం (వైష్ణవాలయాలలో), నందీశ్వరుడు (శివాలయాలలో) ఉంటాయి. గుడిలో భగవంతునికి చేసే నైవేద్యాలు ధ్వజస్తంభానికి కూడా జరుగుతాయి. ఎందుకంటే వీటి స్థాయి మూల విరాట్టుతో సమానం.దేవాలయానికి వెళ్లి ప్రదక్షిణలు చేసేటప్పుడు ధ్వజస్తంభంతో కలిపి చేయాలి. అప్పుడే ప్రదక్షిణలు పూర్తయినట్టు. దేవాలయంలోకి ప్రవేశించగానే ముందుగా ధ్వజస్తంభానికి సాష్టాంగ ప్రణామం చేయాలి. ఎందుకంటే ఇది కూడా స్వామి రూపమే. లోపలుండే మూలవిరాట్టుకు ఉత్సవమూర్తి ఎలాగో ఇది కూడా అటువంటిదే. దారురూపంగా దీన్ని భావించాలి. మూలవిరాట్టుకు ఇచ్చే మర్యాద, గౌరవం మన్నన ధ్వజస్తంభానికి కూడా ఇవ్వాలి. నమస్కార ప్రదక్షిణాలు పూర్తిచేసిన తరువాతే భగవద్దర్శనం కోసం లోపలికి ప్రవేశించాలి. ధ్వజస్తంభం జీవితకాలం పూర్తయిన తరువాత మళ్లీ కొత్త దానిని ప్రతిష్ఠిస్తారు. ఉత్సవాలు ప్రారంభించేటప్పుడు ధ్వజారోహణం చేస్తారు. అంటే జయపతాకను కట్టి పై దాకా ఎగురవేస్తారు. పతాకం చూడగానే దూరాన ఉన్నవారు కూడా ఉత్సవాలు ప్రారంభం అయ్యాయనే విషయాన్ని తెలుసుకుంటారు. ఉత్సవాలు అయిపోగానే పతాకాన్ని దింపుతారు. దానినే ధ్వజావనతం అంటారు. వైష్ణవాలయాల్లో ఈ జెండా మీద గరుత్మంతుని చిహ్నం, శివాలయాల్లో నందీశ్వరుని చిహ్నం, అమ్మవారి దేవాలయాల్లో సింహ చిహ్నం ఉంటాయి. కొన్ని దేవాలయాలలో రాతిధ్వజస్తంభాలు కూడా ఉన్నాయి. గోపుర కలశం కంటే ధ్వజస్తంభం ఎత్తుగా ఉంటే ఉత్తమం, కలశంతో సమానంగా ఉంటే మధ్యమం, కలశం కంటే తక్కువ ఎత్తులో ఉంటే అధమం . ధ్వజస్తంభానికి కింద ఉండే పీఠానికి నాలుగు వైపులా దేవతలను ప్రతిష్ఠిస్తారు. పక్కనే బలిపీఠం పెడతారు. పత్రం, పుష్పం, ఫలం, తోయం పూజ చేస్తారు. వైష్ణవాలయాలలో మూలవిరాట్టుకు ఎదురుగా గరుత్మంతుడు, శివాలయాలలో వీరభద్రుడు, రామాలయాలలో హనుమంతుడు విగ్రహాలు ఉంటాయి.

భారత యుద్ధానంతరం సింహాసనాన్ని అధిష్టించిన ధర్మరాజు అధర్మానికి తావులేకుండా రాజ్యపాలన చేస్తున్నాడు. ధర్మమూర్తిగా, ఎదురులేని దాతగా కీర్తి పతాకం అందుకోవాలనే కాంక్షతో ఎడతెరిపి లేకుండా దానధర్మాలు చేయడం మొదలుపెట్టాడు. ఇది గమనిస్తున్న కృష్ణుడు అతనికి తగు గుణపాఠం నేర్పాలనుకున్నాడు. ధర్మరాజుకి అశ్వమేధ యాగం చేసి, శత్రురాజులను జయించి, దేవ బ్రాహ్మణులను సంతుష్టుల్ని చేసి, రాజ్యాన్ని సుస్థిరం, సుభిక్షం చేసుకొమ్మని సలహా ఇస్తాడు. ధర్మరాజు శ్రీకృష్ణుని మాట శిరసావహించి అశ్వమేధానికి సన్నాహాలు చేయించి, యాగాశ్వమును నకుల సహదేవులు సైన్యంతో యాగాశ్వరక్షకులై బయలుదేరాలు. ఆ యాగాశ్వం చివరికి మణిపుర రాజ్యం చేరింది. ఆ రాజ్యాన్ని మయూర ధ్వజుడు పాలించేవాడు. ఆయన మహా పరాక్రమవంతుడు, గొప్ప దాతగా పేరుగాంచాడు. మయూరధ్వజుని కుమారుడైన తామ్ర ధ్వజుడు పాండవుల యాగాశ్వమును బంధించాడు. తామ్రధ్వజునితో యుద్ధం చేసిన నకులసహదేవులు, భీమార్జునులు ఓడిపోతారు. తమ్ములు ఓడిన విషయం తెలిసిన ధర్మరాజు స్వయంగా బయలుదేరగా కృష్ణుడు అతన్ని వారించి మయూరధ్వజున్ని జయించేందుకు ఒక కపటోపాయాన్ని చెబుతాడు. దాని మేరకు శ్రీకృష్ణుడు, ధర్మరాజులిద్దరూ వృద్ధ బ్రాహ్మణుల రూపంలో మణిపురం చేరారు. వారిని చూసిన మయూరధ్వజుడు వారికి దానం ఇవ్వదలచి ఏమి కావాలో కోరుకోమని అన్నాడు. అందుకు శ్రీకృష్ణుడు, తమ దర్శనార్థమై మేము వస్తున్న దారిలో ఒక సింహం అడ్డు వచ్చి ఈతని కుమారున్ని పట్టుకుంది. బాలుని విడిచిపట్టవలసిందని పార్థించగా అందుకా సింహము మానవ భాషలో మీ కుమారుడు మీకు కావాలంటే మణిపుర రాజ్యాధిపతి మయూరధ్వజుని శరీరంలో సగభాగం నాకు ఆహారంగా ఇప్పించమని కోరింది. ప్రభువులు మా యందు దయదలచి తమ శరీరమున సగభాగం దానమిచ్చి బాలుని కాపాడమని కోరుకుంటారు. వారి మాటలు విని అందుకు అంగీకరించిన మీదట కృష్ణుడు తమ భార్యాపుత్రులే స్వయంగా కోసి ఇవ్వాలనే నియమాన్ని కూడా విధించాడు. అందుకు తగిన ఏర్పాట్లు చేయించి భార్యాసుతులు అతని శరీరాన్ని సగంగా కోయటం చూచిన ధర్మరాజు అతని దాన గుణానికి నివ్వెరపోయాడు. ఇంతలో మయూరధ్వజుని ఎడమకన్ను నుంచి నీరు రావటం గమనించిన ధర్మరాజు "తమరు కన్నీరు కారుస్తూ ఇచ్చిన దానం మాకు వద్దు గాక వద్దు అన్నాడు. అందుకు మహాత్మా తమరు పొరపాటుపడ్డారు. బాధపడి నా శరీరాన్ని మీకివ్వటం లేదు. నా కుడి భాగం పరోపకారానికి ఉపయోగపడింది ఆ భాగ్యం నాకు కలుగలేదు కదా అని ఎడమ కన్ను మిగుల బాధపడుతోంది అంటూ వివరిస్తాడు. మయూరధ్వజుని దానశీలతకు మెచ్చిన శ్రీకృష్ణుడు తన నిజరూపమును చూపి ఏదేని వరం కోరుకోమన్నాడు. "పరమాత్మా! నా శరీరం నశించినా నా ఆత్మ పరోపకారార్థం ఉపయోగపడేలా నిత్యం మీ ముందుఉండేటట్లు దీవించండి" అని కోరుకోగా. అందుకు శ్రీకృష్ణుడు తథాస్తు పలికాడు. మయూరధ్వజా! నేటి నుంచీ ప్రతి దేవాలయం ముందునూ గుర్తుగా నీ పేరున ధ్వజస్తంభాలు వెలుస్తాయి. వాటిని ఆశ్రయించిన నీ ఆత్మ నిత్యం దైవ సాన్నిధ్యంలో ఉంటుంది. ముందు నిన్ను దర్శించి ప్రదక్షిణ నమస్కారాలు ఆచరించిన మీదటనే ప్రజలు తమ ఇష్టదైవాలను దర్శించుకుంటారు. ప్రతినిత్యం నీ శరీరమున దీపం ఎవరుంచుతారో వారి జన్మ సఫలం అవుతుంది. నీ నెత్తిన ఉంచిన దీపం రాత్రులందు బాటసారులకు దారి చూపే దీపం అవుతుంది అంటూ అనుగ్రహించాడు. ఆనాటి నుంచీ ఆలయాల ముందు ధ్వజస్తంభాలు విధిగా ప్రతిష్ఠించడం ఆచారమయింది.

## జంగిల్ క్లియరెన్స్ చేస్తుండగా గిరిజనుడి మృతి



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** విద్యుత్ జంగిల్ పనులు చేస్తుండగా అమాయక గిరిజనుడు మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం, లంబసింగి పంచా యతీ, చిన్నరాజు పాకలు గ్రామంలో నిన్న జంగిల్ క్లియరెన్స్ చేస్తుండగా కరెంట్ షాక్ తగిలి R. రాజుబాబు అనే PVTG గిరిజనుడు అక్కడి కక్కడే మృతి చెందారు. స్థానిక లైనమెన్ LC తీసుకోకుండా కరెంట్ ఆఫ్ చేసేము, తుప్పలు నరకండి అని చెప్పడంతో రోజు కూలీ అయిన రాజుబాబు మరియు ఇతరులు తుప్పలు నరకడం స్టార్ట్ చేయడం జరిగింది. మృతుడు రాజుబాబుని ఐరన్ నిచ్చెన సహాయంతో చెట్టు పైకి ఎక్కించి చెట్టుకొమ్మలు నరుకుతుండగా కొమ్మలు తీగలకి తగిలి ఐరన్ నిచ్చెనకి కరెంట్ పాస్ అయ్యి ఒక్కసారిగా మంటలు వచ్చి కింద పడిపోయి చనిపోయారు.

అక్కడ ఉన్న లైనమెన్ తప్పుదోవ పట్టించి కరెంట్ ఆపకుండా ఆపేనని చెప్పి పని చేయించడం వలనే ఇలా జరిగిందని భార్య, పిల్లలు కన్నీరు మున్నీరు అవుతున్నారు. నిర్లక్ష్యం వహించిన ఎలక్ట్రికల్ JE, AE లైనమెన్ మీద చర్యలు తీసుకోని గిరిజన కుటుంబానికి న్యాయం చేయమని అల్లూరి జిల్లా కలెక్టర్ గారిని కోరుతున్నారు. మృతినికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బాధిత కుటుంబ సభ్యులకు ఆదుకోవాలని మృతిని కుటుంబీకులు తెలిపారు.

## ఎమ్మెల్యే కొణతాల ఆదేశాలతో ఏఎంసి కాలనీలో మంచినీటి సమస్యకు పరిష్కారం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని83వ ఏఎంసి కాలనీలో ఉన్న 8 అపార్ట్మెంట్స్ 192 గడపల కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రస్తుతం అక్కడ గత కొన్ని రోజులుగా మూడు ఫ్లాట్లు 72 గడపలకు సంబంధించి తాగునీరు సమస్య ఉండడంవల్ల ఎన్నో రోజులుగా అక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కూటమి నాయకులు డివిజన్ ఇంచార్జ్ బోద్ధపు ప్రసాద్, వార్డ్ ఇంచార్జ్ లు పిట్ల రాజు, ఎస్. భానుచందర్ (అఖి), దేవీ ద్వారా అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మాజీ శాసనసభ్యులు, నియోజవర్గం ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ అక్కడ ఇబ్బంది పడుతున్న మోటర్ సమస్యను తెలియజేయగా తక్షణమే జీవీఎంసీ అధికారులకు రామకృష్ణ తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం అధికారులు కొత్త మోటర్ ను బిగించి సమస్యను పరిష్కరించారు.

## ఆరుద్ర పురుగులను కాపాడండి




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి గ్రీన్ క్లబ్. అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని ఆధ్వర్యంలో మండలంలోని బట్లపూడి గ్రామంలో ఉన్న సోహం ఆశ్రమంలో ఆదివారం వివిధ రకాల పండ్ల మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని నాటిన మొక్కలు భారీ వృక్షాలుగా ఎదిగేలా పర్యవేక్షించాలని అనకాపల్లి గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల శ్రీధర్ అన్నారు. ఆరుద్ర పురుగులు కనిపించడాన్ని రాబోయే వర్షాలకు సూచనగా భావిస్తారని వీటిని రైతు మిత్రులు జీవ సంబంధ నియంత్రకాలుగా పరిగణిస్తారని అన్నారు ఆరుద్ర పురుగుల మనుగడ పురుగుల మందులు రసాయనకి ఎరువుల వలన ప్రమాదంలో పడిందని జీవజాతులు నశిస్తే తిరిగి పొందలేమని జీవవైవిద్య సంరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అటవీ శాఖ రేంజర్ బి వినోద్ కుమార్, అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని సంస్థ వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, కాండ్రేగుల సత్యనారాయణ (ఎస్ఎఫ్ఐ), బేతాళం సాయి,పీ ఉమామహేశ్వరరావు, వై సూర్య అప్పారావు, ఎం లోకేష్ సోహం ఆశ్రమం కాండ్రేగుల రవి, అన్నమాచార్య వాగ్దేవి వర దాయిని సభ్యులు, గ్రీన్ క్లబ్ సభ్యులు, ఆశ్రమ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కళా భారతిలో మూడు రోజులపాటు హరికథలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ స్థాపించి 26 సంవత్సరాలయింది. ట్రస్ట్ ముఖ్య ఉద్దేశం త్యాగరాజ జయంతి,వర్ధంతి, శామశాస్త్రి ముత్తుస్వామి, నారాయణ తీర్థులు, అన్నమయ్య, తదితర వాగ్గేయ కారుల జయంతోత్సవాలు జరుపుతూ వస్తుంది.

నారాయణ తీర్థుల స్వామి వారి జయంతి సందర్భంగా, తరంగాలు అన్ని కృష్ణుడుపై ఉండటంవల్ల రుక్మిణి కళ్యాణం మహోత్సవం వైదిక సంప్రదాయబద్ధంగా అత్యంత వైభవంగా కళాభారతిలో నిర్వహించారు అర్చక స్వాములు . రుక్మిణి కళ్యాణ మహోత్సవాన్ని చూసినంత మాత్రాన్నే పెళ్ళికాని వారికి పెళ్లి అవుతుందని తెలియజేశారు.

సద్గురు శ్రీ నారాయణతీర్థ విరచిత శ్రీకృష్ణ లీలాతరంగిణి లో ద్వాదశ తరంగముల రుక్మిణీ కళ్యాణము నుండి కొన్ని గానము చేయుచు వైదిక ప్రక్రియ కు అనుసంధానము చేస్తున్న 200 ల సంవత్సరాలుగా కొనసాగుతున్న విశేష సంప్రదాయమును కళాభారతి లో నిర్వహించడం జరిగింది తరంగాలు అన్నిటిని ఘోరకవి శ్రీ సంపత్ కుమార్ గానం చేయగా, ఎం. సత్యనారాయణ శర్మ వైలన్ మీద, ఎం.సత్య ప్రసాద్ మృదంగం పైన సహకారం అందించి అందరి మన్నలను పొందేరు. కార్యక్రమానికి ముందుగాముఖ్య అతిధి శ్రీ ఎక్కిరాల అనంతకృష్ణ, కళాభారతి కార్యదర్శి డాక్టర్ రాంబాబు, నారాయణ తీర్థుల ట్రస్ట్ అధ్యక్షుడు కృష్ణయ్య, పైడా కృష్ణ ప్రసాద్ జ్యోతి ప్రకాశనం చేసి శుభారంభం చేశారు.

కళాభారతి కార్యదర్శి కళాకారులను ప్రశంసిస్తూ సత్కరించారు.

కళాభారతి కార్యదర్శి డా. రాంబాబు గుమ్ములూరి మాట్లాడుతూ ఈనెల 26, 27, 28 మూడు రోజులు హరికథ ఉత్సవాలు ఉన్నాయని ప్రముఖ హరికథ కళాకారులు తెనాలి, గుంటూరు, నెల్లూరు నుంచి వచ్చి మూడు రోజుల కార్యక్రమంలో మూడు కథలు చెప్పనున్నారని అందరూ ఆహ్వానితులేని అందరూ అధికంగా వచ్చి ముఖ్యంగా తర్వాత జనరేషన్ కూడా తీసుకువచ్చి వారికి కథలు వినిపించి మన ప్రాచీన కళలను చూపించి ప్రోత్సాహించాలని కోరారు.

ఆగష్టు 24 నుంచి 29 వరకు 6 రోజులు జాతీయ పురస్కారసభ, సంగీత, నృత్య, నాటకోత్సవాలు ఉంటాయని 2024 కి గాను 94 సంవత్సరాల క్లారినెట్ విద్వాన్సులు పద్మశ్రీ AKC నటరాజన్‌కి " నాద విద్యా భారతి " బిరుదు ప్రదానంతో, స్వర్ణకమలంతో సత్కరించు నున్నామని, అన్ని రోజులు అందరూ ఆహ్వానితులే అని తెలియజేసేరు.

## సోంపేట బీలాభూములను పరిరక్షించుకుందాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సోంపేట బీలను పరిరక్షించుకుందాం, ఉద్యమకారులు మీద పెట్టిన కేసులు ఎత్తి వేయించుదాం అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యన్నారాయణ అన్నారు. ఆదివారం ఉదయం సోంపేట బీల ఉద్యమంలో అమరులైన గొనప కృష్ణమూర్తి, బెందాళం కృష్ణమూర్తి, గున్న జోగారావుల స్థూపం వద్దకు వెళ్ళి అంజలి ఘటించిన అనంతరం నిర్వహించిన 14 వ సంస్మరణ సభ లో ఆయన మాట్లాడారు. ప్రధానంగా 329 వ జిఓ ను రద్దు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

తమ పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి అయిన పవన్ కళ్యాణ్ దగ్గరకు వెళ్ళి మాట్లాడుతానని హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి తక్షణ కర్తవ్యంగా భావించి కృషి చెయ్యాలి అని కోరారు. 23 గ్రామాల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు.

మానవ హక్కుల వేదిక ప్రతినిధి వి ఎస్ కృష్ణ మాట్లాడుతూ ఒక రైలు ను కాల్చేసిన వారి మీద పెట్టిన కేసులు ఎత్తి వేశారు, కానీ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసిన వారి మీద పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయకపోవడం అన్యాయం అన్నారు. బీలా భూములు పరిరక్షించండి బొగ్గు ఆధారిత విద్యుత్ పరిశ్రమ వద్దని పోరాడితే ముగ్గురు అమరులైన తర్వాత దానిని ఆపి 329 పేరు తో ఇంకో పరిశ్రమకు జిఒ ఇవ్వడం అన్యాయం అన్నారు. ఉద్యమకారుల మీద పెట్టిన కేసులు ఎత్తి వేయాలని, 329 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంస్థ అధ్యక్షులు డాక్టర్ వై క్రిష్ణమూర్తి, ప్రతినిధి టి. రామారావు, జిల్లా సహకార బ్యాంకు మాజీ చైర్మన్ డి జగన్ తదితరులు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ సంస్థ, మత్స్యకారులు సంక్షేమ సంఘం, కలాసీ సంఘం ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వంశీకృష్ణ ఆధ్వర్యంలో హిమోపోలియా ఇంజక్షన్లు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** హిమోపోలియా హిమోఫోలియా హిమోఫిలియా సొసైటీ విశాఖపట్నం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ పక్కన ఉన్న స్టే ఇన్ గెస్ట్ హౌస్ లో 125 మంది హిమోపోలియ పేషెంట్స్ ఫౌండేషన్ వారు ఉచిత ఇంజక్షన్లను విశాఖ సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ డిజాస్టర్ అనే గాయ నుంచి రక్తం గడ్డ కట్టడానికి ఎక్కువ సమయం తీసుకుంటుందని ఇప్పుడు పంపిణీ చేస్తున్న ఖరీదైన ఇంజక్షన్ మాత్రమే తాత్కాలిక ఉప్పు సమరం అనే ఈ సందర్భంగా తెలిపారు బాధితుల తరపున నిర్వాహకులు వినతిపత్రం వంశీ గారికి అందజేశారు కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు అర్హులైన పేషెంట్స్ అవసరమైనవి నిబంధనం లేకుండా పెన్షన్ మంజూరు చేయాలని పేషెంట్ కి వికలాంగులు సర్టిఫికెట్ ఇవ్వాలని రక్త పరీక్షలు కోసం లేబరేటరీ సదుపాయం ఏర్పాటు చేయాలని ఈ వినతి పత్రంలో పొందుపరిచారు కార్యక్రమం లో వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పకుండా తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని వారు కోర్కెల విషయా లపై సంబంధిత అధికారులతో మాట్లాడి నెరవేర్చుటకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యే శ్వర రావు, సాయి బాబా, మనోజ్‌తో పాటు జనసేన పార్టీ స్టేట్ సెక్రటరీ దుర్గాప్రసాద్, స్థానిక కార్పొరేటర్ నారాయణ రావు, మాజీ కార్పొరేటర్ అనురాధ జనసేన పార్టీ అధ్యక్షులు శ్రావణ్ పాల్గొన్నారు.

## ఘనంగా రత్నాకర్ జన్మదిన వేడుకలు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నియోజకవర్గంలోని అనకాపల్లి, కశింకోట మండలాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ జన్మదినం సందర్భంగా సోమవారం తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తమ అభిమాన నాయకుడి పుట్టిన రోజు వేడుకలను పలుచోట్ల ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని గవరపాలెంలో అన్నపూర్ణమ్మ గుడి వద్ద స్థానిక నాయకులు, అభిమానులు, కార్యకర్తల ఆధ్వర్యంలో రత్నాకర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పెదరామస్వామి కోవెల వద్ద దాడి రత్నాకర్ అభిమానులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులకు పళ్ళు రొట్టెలు అందజేశారు. కస్పా వీధిలో జరిగిన జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక కార్యకర్తల ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు బియ్యం పంపిణీ చేశారు. కశింకోటలో తెదేపా ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో రోగులను పరీక్షించి వారికి మందులు పంపిణీ చేశారు. పళ్ళు, రొట్టెలు పంచి పెట్టారు. కశింకోట సత్యసాయి సేవా మందిరం వద్ద తెదేపా కార్యకర్తలు, నాయకులు పేదలకు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కశింకోటలో బీసీ సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు స్వీట్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. పరవాడపాలెంలో రత్నాకర్ పుట్టినరోజు సందర్భంగా నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి విద్యార్థులకు బియ్యం, పుస్తకాలు పంపిణీ చేశారు. కొక్కిరాపల్లి అనాధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో రత్నాకర్ గారి జన్మదిన వేడుకల సందర్భంగా తెదేపా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు.

## చాగంటి వారి గురించి

**చాగంటిపై కవితా..**

ప్రవచనానికి నిర్వచనమైన శారదా పుత్రునిపై వచన కవనమా.. వచనానికే బహువచనమైన ప్రవచనచక్రవర్తిపై నాలుగు మాటలు రాయాలని ఆర్తి.. మాటకే స్ఫూర్తి... ఎల్లలేని కీర్తి.. ఎనలేని సమయస్ఫూర్తి ఆ పరిపూర్ణ మానవతామూర్తి.. ఎంత రాస్తే..ఏమని వర్ణిస్తే తృప్తి..నా దీప్తి.. చంద్రునికో నూలుపోగు.. పుంభావ సరస్వతికి అక్షరాల హారతి.. ఈ రీతి..నా నిరతి!

**చాగంటి గళం**

పోతన పద్యాల గంగాళమా.. ఆ రసన వాల్మీకి తన రామాయణాన్ని ఖించిన తాళపత్రమా.. శ్లోకం ఆయన నోట పంచదార పాకం.. పద్యం దేవదేవునికే నైవేద్యం! చాగంటి మాటలు చద్ది మూటలు.. ధారణ అసాధారణమై.. అజ్ఞానాంధకారంలో మసలే నిను నడిపించేటి వెలుగు కిరణమై.. ఆధ్యాత్మిక తోరణమై.. ముక్తి వైపు నీ చేయి పట్టి నడిపే ఆపన్నహస్తమై.. నీ విజ్ఞాన సమస్తమై..!

**ఇలాంటి ఓ మనిషిని-**

ప్రజ్ఞాన సర్వస్వమనాలో.. ఆధ్యాత్మిక భాండాగారమ పిలవాలో.. పురుషరూపం దాల్చిన వాగ్దేవి అని కొలవాలో.. కారణజన్ముడని స్తుతించాలో.. దేవుడే అని ప్రస్తుతించాలో..!

**ప్రవచనం ఆయనకు దైనందినం..**

ఎన్నిసార్లు చేసినా ఆనందమే దినం దినం.. ఆయన ఆసీనమైన వేదిక భక్తి సుమాల నందనం.. ఆ సన్నిధానమే సకల క్షేత్ర సందర్శనం.. అక్కడ దేవతలే సంచరిస్తున్న అనుభూతి దైవత్వ ఉనికికే ప్రత్యక్ష నిదర్శనం..!

**చాగంటి ప్రవచన శ్రవణం**

దివ్యలోక విహారం.. పక్కనే వాగ్దేవి ఉన్నట్టు.. అచ్చోట శ్రీరాముడే సీతాసమేతుడై కొలువుదీరినట్టు.. సభాస్థలిని అంజనాపుత్రుడే పర్యవేక్షిస్తున్నట్టు.. ముక్కంటి ఆ వాగ్ధాటిని గని..విని.. శిరసుపై ఉన్న గంగతో నీ వేగాన్ని మించిన ఆ వాక్ప్రవాహాన్ని చూసావా.. అని మేల మాడినట్టు.. వేణుగోపాలుడు ఇతడు సాందీపుడా అని దీపం వెలుగులో మరింత నిశితంగా చూసినట్టు.. వ్యాసుడు తనను తానే చూసుకుంటున్నట్టు.. ముక్కోటి దేవతలే మారువేషాల్లో బెరుకుగా ఇరుకున వరసల్లో కూర్చున్నట్టు.. సభ దేవసభే అన్నట్టు.. కలియుగమే భక్తిరసరమ్యయోగమైనట్టు..!

**చాగంటి పలుకు..**

వేదానికి అనువాదం.. ఆధ్యాత్మిక నినాదం.. కలియుగంలో భక్తినాదం.. వాగ్దేవికి ముదం.. సకల దేవతలకు ఆమోదం..!

**ధర్మ స్థాపనకు దేవుని అవతారం..**

ధర్మరక్షణకు రుషి.. ధర్మబోధనకు గురువు.. ధర్మవ్యాప్తికి ప్రయోక్త.. ఈ అందరి సమ్మేళనమే చాగంటి అనే వక్త.. పంచె..లాల్చీ కట్టి.. నుదుటిన విభూతి పెట్టి... ధోవతి ధరించి.. వేదికను అలంకరించే.. ధర్మ ప్రచార ప్రవక్త..!

**కృష్ణం వందే జగద్గురుం..**

చాగంటి యందే మన సద్గురం.. కోటేశ్వరా..కోటి దండాలు..!



**చాగంటి గుడిగంట**
**ప్రవచనకర్త పుట్టినరోజు**
**ఎలిశెట్టి సురేష్ కుమార్)**
**9948546286**

## విశాఖ యువకుడి దాడిలో గాయపడిన కానిస్టేబుల్‌ని పరామర్శించిన హెూం మంత్రి అనిత



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కానిస్టేబుల్ పై మద్యం మత్తులో యువకుడు దాడి. సెవెన్ హిల్స్ హస్పటల్ లో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ అప్పారావు పరామర్శించిన హెూమంత్రి అనిత.

ఏపీలో గంజాయి,డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నాం. ఈ కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలి. పోలీసులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుంది. విధుల్లో ఉన్న పోలీసులు ఆత్మస్థైర్యంతో పని చేయాలి.. కానిస్టేబుల్ అప్పారావు కుటుంబానికి అండగా ఉంటామని హామి ఇచ్చిన హెూం మంత్రి.

## ఆల్ ఇండియా టెన్నికాయిట్ టెక్నికల్ కమిటీ చైర్మన్గా కే.ఎన్.వి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఆల్ ఇండియా టెన్నికాయిట్ టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా కెఎన్‌వి సత్యనారాయణని నియమించడం జరిగింది. ఆయన నాలుగు సంవత్సరాలు 2024 నుండి 2028 వరకు ఈ పదవీలో పనిచేయనున్నారు. జాతీయ టెన్నికాయిట్ కార్య వర్గ సమైక్య సమావేశం ఢిల్లీలో జరిగింది. సమావేశంలో ఈ నియామకం జరిగింది అని కే ఎన్ వి తెలిపారు. కే ఎన్ వి నియామకం పట్ల రాష్ట్ర టెన్నీకాయిట్ అధ్యక్షులు వైడి రామారావు , చైర్మన్ పీజీవీఆర్ నాయుడు(గణబాబు) తవిటీయ్యా అభినందనలు తెలిపారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 95 వినతులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో అదనపు కమిషనర్ (డెవలప్ మెంట్) కె.ఎస్.విశ్వనాధన్ తో కలిసి నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 95 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 15, 3వ జోన్ కు 26, 4వ జోన్ కు 12, 5వ జోన్ కు 12, 6వ జోనుకు 12, 8వ జోన్ కు 10, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 07 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి రెవెన్యూ విభాగమునకు 10, ప్రజారోగ్య విభాగమునకు 04, పట్టణ ప్రణాళిక విభాగమునకు 58, ఇంజినీరింగు విభాగమునకు 16, ఉద్యాన వనం విభాగమునకు 03, యు సి డి విభాగానికి 04 కలిపి మొత్తంగా 95 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.స. విశ్వనాథన్ మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డా.వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజనీర్ రవి కృష్ణ రాజు, చీఫ్ సిటీ ప్లానరు బి.సురేష్ కుమార్, ప్రధాన వైద్యాదికారి డా.నరేష్ కుమార్, డిసి(రెవెన్యూ) శ్రీనివాసరావు, కార్యదర్శి పి.నల్లనయ్య, డిడిహెచ్ ఎం.దామోదరరావు, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, ఎఫ్.ఎఅండ్.ఓ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజనీర్లు, డిపిఓ చంద్రిక, సివిఒ డా.ఎన్.కిషోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, బయోలజిస్ట్ సాంబమూర్తి, యుసిడి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన, చైతన్యంతో కూడిన పోరాటమే సమస్య పరిష్కారానికి ప్రధానం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ స్టీల్ ప్లాంట్ ఎదుర్కొం టున్న సమస్యలపై నిష్ణాతుల తో కార్మికులలో అవగాహన, చైతన్యంన్ని కలిగించి, వారితో సరియైన పోరాటాలను నిర్మించి పోరాడటం ద్వారానే సమస్యకు పరిష్కారం సాధ్యమని స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో "సంక్షోభంలో విశాఖ ఉక్కు-పరిష్కారం ఎలా"అనే సదస్సును నిర్వహిస్తున్న సందర్భంగా సదస్సు గోడ పతులను నేడు స్టీల్ ప్లాంట్ లోని స్టోర్ జంక్షన్ వద్ద విడుదల చేశారు.

ఈ సందర్భంగా జె అయోధ్యరామ్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కు కలిగిన సంక్షోభాలను ఎదుర్కోవడంలో స్టీల్ సిఐటియు ప్రధాన భూమిక పోషించిందని ఆయన అన్నారు. సమస్యల పరిష్కారం కొరకు నిష్ణాతులచే కార్మికులలో అవగాహన కల్పిస్తూ వారితో కలసి చైతన్యంతో కూడిన పోరాటాలను చేస్తేనే వాటిపై విజయం సాధ్యమని ఆయన వివరించారు. గడచిన కొంత కాలంగా స్టీల్ ప్లాంట్ కు మైన్స్ కేటాయించాలని పాదయాత్రలు, రక్తదానం తదితర కార్యక్రమాల ద్వారా చైతన్యాన్ని కలిగించిన ఘనత స్టీల్ సిఐటియు కు ఉందని ఆయన అన్నారు. నేడు స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యకు ప్రధాన కారణంగా దీనిని ప్రభుత్వ యాజమాన్యాలు గుర్తించాయని ఆయన వివరించారు. కనుక ఈ సమయంలో ఈ అంశంపై మరింత అవగాహనను చైతన్యాన్ని కలిగించాలనే ప్రధాన ఆశయంతో జరుగుతున్న ఈ సదస్సును జయప్రదం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ ఈ సదస్సును ఉక్కునగరం స్టీల్ సిఐటియు కార్యాలయం ముందు 17-7-24(బుధవారం) సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. దీనిలో ముఖ్య వక్తలుగా మాజీ స్టీల్ ప్లాంట్ సిఎండి శివసాగర్ రావు గారు, అఖిల భారత సిఐటియు ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు జె డి లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ లలిత్ మిత్రా, రాష్ట్ర సిఐటియు ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్ నర్సింగరావు పాల్గొనున్నార ని ఆయన వివరించారు. నేడు స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వీరు సూచించే మార్గాలపై కార్మికులు అవగాహన కల్పించుకోని తద్వారా మన పోరాటాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించ గలుగుతామని ఆయన అన్నారు. కనుక ఈ సదస్సులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాస రాజు, కె గంగాధర్, నీలకంఠం, కృష్ణమూర్తి, టి వి కె రాజు, శంకర్రావు, శ్రీనివాస్ రెడ్డి, వి మురళి, డి ఎస్ వి ఎస్ శ్రీనివాస్, దుర్గాప్రసాద్, ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకున్న పీలా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలోని గూడ్స్ రోడ్డులో ఉన్న ఇంద్ర జ్యుమ్న మందిరంలో కొలువుదీరిన శ్రీ బలబద్ర శ్రీ సుభద్ర సమేత శ్రీ జగన్నాథ స్వామి వారినీ మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా స్వామి వారు బుద్ధ అవతారంలో దర్శనం ఇచ్చాయి.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ దాడి బుజ్జి (వైభవ్) ఆలయ కమిటీసభ్యులు అయనకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

# ప్రజల అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు, ఆర్.డి.ఒ. కె. హేమలత ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలపై వెంటనే స్పందించి పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 129 అర్జీలు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో అందిన అర్జీలు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.లి2009 - 2010 మధ్యలో సహారా సంస్థకి ప్రజల నుండి పార్వతీపురం మన్యం జిల్లా బ్రాంచ్ నుంచి సుమారు 100 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగిందని, తర్వాత సహారా సంస్థ మోసం చేయడం తో జిల్లా నుంచి సహారాకి కట్టిన 100 కోట్ల రూపాయలు ప్రజలు నష్టపోయారని, సహారా సంస్థ ద్వారా పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో రావలసిన వంద కోట్ల రూపాయలను ప్రజలకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు, సహారా బాధిత ఖాతాదారులు, ఏజెంట్లు అర్జీ అందజేశారు.లి కొమరాడ మండలం కుంతేశుగ్రామపంచాయతీ జాప్పంగి గ్రామానికిరోడ్డు సదుపాయంలేక యిబ్బందులు పడుతున్నామని, మట్టిరోడ్డు వర్షాలకు కొట్టుకుపోయిందని, కావున మసిమండ గ్రామం నండి తేగలపాడు మీదుగా జాప్పంగి గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ చోడి పెంటయ్య, గ్రామస్తులు అర్జీ అందజేసారు. పార్వతీపురం మండలం గూడారి వలస గ్రామంలో 70 కుటుంబాలు జీవిస్తున్నాయని, గ్రామానికి మినీ అంగన్వాడి సెంటర్ లేక గర్భిణీలు, పిల్లలు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారని గ్రామంలో మినీ అంగన్వాడి సెంటర్ ఏర్పాటు చేయాలని కర్రి ఉషారాణి దరఖాస్తు సమర్పించారు. సాలూరు మండలం జీగిరాం గ్రామంలో చాలా సంవత్సరాలనుండి ఎఫ్. పి. షాప్ డీలర్ పోస్ట్ ఖాళీగా ఉన్నందున గ్రామ ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని, గ్రామంలో చాలామంది ఎస్సీ నిరుద్యోగులు, మహిళా సంఘాలు వారు ఉన్నారని వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి శాశ్వత ఎఫ్. పి. షాప్ డీలరుగా నియమించవలసిందిగా గ్రామ ప్రజలు, మహిళా సంఘాలు వారు కోరారు.కొమరాడ మండలం దలియపేట గ్రామానికి చెందిన కె.విజయ తన కుమారుడు విభిన్న ప్రతిభావంతుడని, పెన్షన్ సర్టిఫికెట్లు లో మండలం మరియు జిల్లా పేరు తప్పుగా నమోదయిందని, తప్పులను సవరించాలని కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలం జర్న గ్రామానికి చెందిన కె.రెల్లమ్మ, ఇతరులు 2021-2022 సంవత్సరంలో పీఎంజేఏవై సంబంధించిన హౌసింగ్ బిల్లులు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. సీతానగరం మండలం చెల్లంనాయుడువలస గ్రామానికి చెందిన డి.జి.ఎస్.వి.త్రినాథ్ లక్ష్మీపురం గ్రామ రెవెన్యూలో భూమి ఉందని, ఆ భూమి తన యొక్క కుమార్తెకు రిజిస్ట్రేషన్ చేయుటకు బొబ్బిలి సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో 1-B వివరాలు ఓపెన్ కాకపోవడం వలన రిజిస్ట్రేషన్ అవ్వలేదని దరఖాస్తు అందజేశారు.పార్వతీపురం మండలం పార్వతీపురం గ్రామానికి చెందిన జి. పద్మావతి జగనన్న చేయూత డబ్బులు మంజూరు చేయాలని కోరారు.పార్వతీపురం మండలం సుడిగాం గ్రామానికి చెందిన మజ్జి దశరథ విభిన్న ప్రతిభావంతుడనని, ఉన్నత విద్య అర్హత కలిగి ఉన్నానని, విభిన్న ప్రతిభావంతుల శాఖ లో ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు.

సీతానగరం మండలం పెదబోగిల గ్రామానికి చెందిన కురమాల కరుణమ్మ తన భర్త 10నెలల క్రితం మరణించారని, వితంతు పెన్షను మంజూరుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Kakinada (K.B. Ramarao): Cell: 9949413661, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Bheemili (D.V.Chalapathi Rao) : Cell: 9849603258, Office (Raghunath) : 7013785256. Arilova (D.Venkatesh) : 73825 85777. Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Yelamanchili (P.S.N. Murthy) : 83095 38789 Anakapalli (M.Krishna Rao) : 63023 75539
Paderu (P.Ravi Kumar) : 94908 12271 Parvathipuram (S.S.Naidu) : 94900 27519 Chintapalli (Srinivas) : 94923 40861 Chodavaram (BVR Murthy) : 81431 22188

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.